ఫొటో : కె నరహరి

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 123 విజయవాడ, సోమవారం 4 డిసెంబర్ 2023 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No Vijayawada, Monday 4 December 2023 Rs

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాల్లో మునిగిన కార్యకర్తలకు గాంధీభవన్ వద్ద అభివాదం చేస్తున్న తెలంగాణ పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్

రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి

పెరిగిన మతోన్మాద శక్తుల ప్రమాదం

మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక వెల్లువ

తీవ్ర ఉత్కంఠ మధ్య ఆదివారం వెల్లడైన నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది, రాజస్థాన్, మధ్యప్రదేశ్,ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బిజెపి గెలిచింది. వీటిలో రాజస్థాన్; ఛత్తీస్‌గఢ్‌లను ఆ పార్టీ కాంగ్రెస్ నుండి కైవసం చేసుకుంది. తెలంగాణలో మొత్తం 119 స్థానాలకు గానూ 64 స్థానాల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కసరత్తు ప్రారంభించింది. వరుసగా రెండు ఎన్నికల్లో గెలుపొందిన బిఆర్ఎస్ తాజా ఎన్నికల్లో 39 సీట్లకే పరిమితమైంది. దీంతో ముఖ్యమంత్రి కెసిఆర్ తన పదవికి రాజీనామా చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యేంతవరకు ఆపధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ తమిళిసై ఆయన్ను కోరారు. మరోవైపు గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ అగ్రనేతలు ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత తెలియచేస్తూ లేఖను అందచేశారు. సోమవారం ఉదయం కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశం జరగనుంది. తెలంగాణలో బిజెపికి 8స్థానాలు దక్కాయి. ఎంఐఎం ఏడు స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకుని ఎన్నికల బరిలో దిగిన సిపిఐ కొత్తగూడెం స్థానం నుండి గెలుపొందింది. మధ్యప్రదేశ్‌లో బిజెపి మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకుంది. మొత్తం 230 సీట్లకు గానూ, 163 సీట్లను ఆ పార్టీ సాధించింది. కాంగ్రెస్ 66 స్థానాలకే పరిమితమైంది. ప్రతి ఎన్నికల్లోనూ ప్రభుత్వాన్ని మార్చే సాంప్రదాయమున్న రాజస్థాన్ ఓటర్లు తాజా ఎన్నికల్లోనూ ఆ ఒరవడిని కొనసాగించారు. రాజస్థాన్‌లో మొత్తం 200 స్థానాలకు గానూ ఎన్నికలు జరిగిన 199 స్థానాల్లో బిజెపి 115సీట్లు గెలుచుకోగా కాంగ్రెస్ 69 స్థానాలకే పరిమితమైంది. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 స్థానాలకు గానూ, బిజెపి 54 స్థానాలను చేజిక్కించుకోగా, కాంగ్రెస్‌కు 35 స్థానాలే దక్కాయి. మొత్తంమీద బిజెపి రెండు రాష్ట్రాల్లో అదనంగా అధికారంలోకి రావడంతో పాటు తెలంగాణలో కూడా బలాన్ని పెంచుకుంది. దీంతో మతోన్మాద శక్తుల ప్రమాదం మరింతగా పెరిగినట్లైంది. లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఈ సవాల్‌ను ఎదుర్కొని ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు రెట్టించిన పట్టుదలతో ఐక్య పోరాటాలు చేయాల్సిఉంది. తెలంగాణ, రాజస్థాన్; ఛత్తీస్‌గఢ్‌లలో ప్రభుత్వాలపై వ్యతిరేకత కూడా తీవ్రస్థాయిలో కనిపించింది. ఫలితంగా అధికారంలో ఉన్న పార్టీలు పరాజయం పాలయ్యాయి. రెండు స్థానాల నుండి పోటీ చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక స్థానంలో ఓటమి చవిచూశారు. ఆరుగురు మంత్రులు కూడా ఓడిపోయారు.

- వివరాలు లోపలిపేజీల్లో

మూడు రాష్ట్రాల్లో...

రాష్ట్రం	మొత్తం సీట్లు	బిజెపి	కాంగ్రెస్	ఇతరులు
రాజస్థాన్	199	115	69	15 (బిఎస్‌పి 2)
మధ్యప్రదేశ్	230	163	66	1
ఛత్తీస్‌గఢ్	90	54	35	1

తెలంగాణ (119)

కాంగ్రెస్	64
బిఆర్ఎస్	39
బిజెపి	8
ఎంఐఎం	7
సిపిఐ	1

రెట్టించిన పట్టుదలతో పోరాడాలి

మితవాద బిజెపిని ఎదుర్కొనేందుకు లౌకిక ప్రజాతంత్ర శక్తులు రెట్టించిన పట్టుదలతో పోరాడాల్సిన అవసరాన్ని ఈ నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. "ప్రజలు వారి తీర్పును ఇచ్చారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారం చేజిక్కించుకోగా, తెలంగాణాలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నుండి కాంగ్రెస్ అధికారాన్ని కైవసం చేసుకుంది. జీవనోపాధి వంటి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి, భారత రిపబ్లిక్ లౌకిక, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు లౌకిక శక్తులు తమ కృషిని రెట్టింపు చేయాలి.

-సీతారాం ఏచూరి, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి

సుపరిపాలనకే ఓటు

ప్రజలకు సుపరిపాలనను, అభివృద్ధిని అందించాలన్నది బిజెపి లక్ష్యం, దానికే ప్రజలు ఓటు వేశారు. తిరుగులేని మద్దతునందించిన ప్రజలకు కృతజ్ఞతలు. వారి సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తాం. పార్టీ అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేసిన కార్యకర్తలకు అభినందనలు.

- ప్రధాని నరేంద్ర మోడీ

ఆ మూడు రాష్ట్రాలో ఓటమి నిరాశపరిచింది

'బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఓటమి తనను నిరాశపరిచింది. తాత్కాలికంగా ఎదురైన ఎదురుదెబ్బలను అధిగమించి, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా వేదిక భాగస్వామ్య పక్షాలతో కలిసి ఐక్యంగా పోరాడేందుకు కృషి చేస్తాం.

- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

6న ఇండియా ఫోరం భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందించేందుకు 'ఇండియా' ఫోరం నేతలు ఈ నెల6న ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశం కానున్నారు. ఈ సమావేశం బుధవారం సాయంత్రం జరగనుంది. బిజెపిని ఐక్యంగా ఎదుర్కోవాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఈ ఫోరమ్‌లో ఇప్పటివరకు 26 పార్టీలు భాగస్వాములయ్యాయి. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఐక్యంగా ఎదుర్కొనేందుకు ఫోరం నేతలు వివిధ ప్రణాళికలను చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ముంబయి జరిగిన గత సమావేశానికి శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాకరే అధ్యక్షత వహించారు. నాటి సమావేశానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు పలువురు ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఇప్పటివరకు పాట్నా, బెంగళూరు, ముంబయిలో మూడు సార్లు ఇండియా ఫోరమ్ సమావేశాలు జరిగాయి. అక్టోబరు మొదటి వారంలో భోపాల్‌లో ర్యాలీ నిర్వహించాలని భావించినప్పటికీ చివరి నిమిషంలో ఆ యోచనను విరమించుకున్నారు.

వణికిస్తున్న 'మిచౌంగ్'

- నెల్లూరు, తిరుపతిలో భారీ వర్షాలు
- గోడకూలి బాలుడి మృతి
- రేపటికి తీవ్ర తుపాన్‌గా మారే అవకాశం
- పోర్టులో ఒకటో ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి -యంత్రాంగం

రాష్ట్రాన్ని మిచౌంగ్ తుపాన్ వణికిస్తోంది. నెల్లూరు,తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. రాష్ట్రమంతా ఆకాశం మేఘావృత్తమైఉంది. ఆదివారం ఉదయం నుండి కురిసిన వర్షాలతో ఈ రెండు జిల్లాల్లోనూ లోతట్టు ప్రాంతాలు జలమయమైనాయి. మరోవైపు రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మంగళవారం నాటికి తీవ్ర తుపాన్‌గా మారే అవకాశం ఉందని హెచ్చరించింది.

దీంతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. సముద్రం ఒడ్డుకు ప్రజలు వెళ్లరాదని, టూరిస్టులను నియంత్రించాలని కేంద్ర, రాష్ట్రాల విపత్తుల నిర్వహణ సంస్థలు హెచ్చరికలు జారీ చేశాయి. రాష్ట్రంలోని పోర్టులన్నిట్లోనూ ఒకటో నెంబరు హెచ్చరికలను ఎగరవేశారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులో ఉంచారు. నెల్లూరు జిల్లాలోని 18 మండలాలపై తుపాను ప్రభావం పడింది. ఎడతెరపిలేని వర్షం వల్ల నెల్లూరులోనివైఎస్ఆర్ నగర్, ఎన్‌టిఆర్ నగర్, పడారుపల్లి, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. నగరానికి రెండు ఎన్‌టిఆర్ఎఫ్ బృందాలు, కావలికి ఒక ఎన్‌డిఆర్ఎఫ్ బృందం చేరుకున్నాయి. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో అత్యధికంగా 128.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి ఏర్పేడు మండలం చిందేపాళ్యం యానాది కాలనీలో పూరింటి గోడ కూలి యశ్వంత్ (4) దుర్మరణం చెందాడు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, కెవిబి పురం, బుచ్చినాయుడు కండ్రిగ, పెళ్లకూరు, నాయుడుపేట మండలాల్లో పది వేల ఎకరాల్లో వరి పొలలు నీట మునిగాయి. కెవిబి పురం మండలం కోవనూరు సమీపంలో శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలోని వాగు ప్రమాద స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అవతల వైపు ఉన్న సుమారు 40 గ్రామాలకు శ్రీకాళహస్తి పట్టణంతో సంబంధాలు తెగిపోయాయి. తిరుమలలో గత రెండు రోజులుగా వర్షం, చలిగాలు వల్ల సందర్శకులు గదుల నుంచి బయటకు రాలేకపోతున్నారు. చిత్తూరు, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఈదురుగాలులు వీస్తున్నాయి. ఉప్పాడలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు బీచ్ రోడ్డును తాకడంతో ఉప్పాడ బీచ్‌రోడ్డులో రాకపోకలను నిలిపేశారు. తుపాను దృష్ట్యా డిఎంహెచ్‌ఒలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ కమిషనరు జె నివాస్ ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని, మారుమూల ప్రాంతాలు, హెల్త్ వెల్నెస్ సెంటర్లలో సరిపడా మందుల్ని ముందుగానే నిల్వ చేసుకోవాలని సూచించారు. ఈ వారంలో ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణులను ముందుగానే సమీన ఆస్పత్రులకు తరలించాలన్నారు. పాము కాటు చికిత్సకు అవసరమైన ఇంజక్షన్లను అన్ని పిహెచ్‌సిల్లోనూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

నెల్లూరులోని విఆర్‌సి సెంటర్ వద్ద వర్షపునీటితో నిండిన అండర్ బ్రిడ్జి

రాజ్‌భవన్‌లో గవర్నరు తమిళసైని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, డికె శివకుమార్

మేం సిద్ధం..

- ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించండి
- గవర్నర్‌తో కాంగ్రెస్ నేతలు
- నేడు ప్రమాణస్వీకారోత్సవం?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో స్పష్టమైన ఆధిక్యత రావడంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రకియను కాంగ్రెస్ పార్టీ ముమ్మరం చేసింది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో కాంగ్రెస్ నేతల బృందం గవర్నర్ తమిళిసైని కలిసింది. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతూ లేఖను అందచేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, నేతలు డికె శివకుమార్, మాణిక్‌రావ్ ఠాక్రే, ఉత్తమకుమార్‌రెడ్డి, మల్లు రవి తదితరులు ఉన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత సంఖ్యాబలం తమకు ఉందని వారు గవర్నర్‌కు చెప్పారు. సోమవారం శాసనసభ పక్ష సమావేశం జరుగుతుందని, ఆ సమావేశం అనంతరం సిఎల్‌పి నేత పేరును కూడా తెలియచేస్తామని చెప్పారు. మరోవైపు నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. సోమవారం సాయంత్రం ప్రమాణస్వీకారం

మిగతా 5లో

అప్రమత్తంగా ఉండండి

- తుపాన్‌పై కలెక్టర్లతో సమీక్షలో సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. శిబిరాల్లో సౌకర్యాలు ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి తుపాను పరిస్థితులపై అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. శిబిరాల్లో ఆహారం, తాగునీరు, విద్యుత్, రవాణా, సమాచార, కమ్యూనికేషన్ల వ్యవస్థ దెబ్బతింటే యుద్ధ ప్రాతిపదికన వాటిని పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయా విభాగాలను సిఎం ఆదేశించారు. తుపాను పరిస్థితులు, చేపడుతున్న సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని అధికారులను చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సోమవారం ఉదయం మరోసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తానన్నారు. అలాగే పొలాలు, కళ్లాల్లోని ధాన్యం తడిచిపోకుండా పౌరసరఫరాలశాఖకు చెందిన అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం తడిచిపోకుండా వెంటనే మిల్లులకు తరలించే బాధ్యతను తీసుకోవాలన్నారు. తేమ వంటి సాంకేతిక అంశాలను పక్కనపెట్టి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే ప్రొక్యూర్ చేసి, భద్రమైన ప్రాంతాలకు తరలించాలని సిఎం స్పష్టం చేశారు. తుపాను కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున జలవనరులశాఖ అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో భారీ వర్షాలు కారణంగా వచ్చే పరిస్థితులను ఎదుర్కోవడానికి అప్రమత్తంగా ఉండాలని, తుపాను అనంతరం యుద్ధ ప్రాతిపదికన ఆయా గ్రామాలు, పట్టణాలు, నగరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

11.61 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు

సరైన రికార్డుల్లేవట!

- పెద్దలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం వ్యూహాత్మక అడుగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూమిలేని పేదలకు దశాబ్దాల కాలంగా అనేక ప్రభుత్వాలు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో రాష్ట్ర వ్యాప్తంగా 11.61 లక్షల ఎకరాలకు సరైన రికార్డులు లేవని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో కేవలం 11,266 ఎకరాల భూములు నీటివనరుల (వాటర్‌బాడీ) కింద ఉన్నాయి. ఇదిలా ఉంటే మిగిలిన భూములకు యజమానులు వీరేననే నిర్ధారించేందుకు సరిపడా రికార్డులు లేవని ప్రభుత్వం పేర్కొంటుండటం వ్యూహాత్మకమేనా అనే చర్చ నడుస్తోంది. ఆ సాకుతో గ్రామ స్థాయిలోని పెత్తందారులు, రాజకీయ నాయకులు, బడా బాబులకు ఆయా భూములను సులభంగా కట్టబెట్టేందుకే ఈ ప్రయత్నమని అంటున్నారు. అసైన్డ్ ల్యాండ్స్ పంపిణీ చేసి 20 ఏళ్లు దాటినా నిజమైన లబ్ధిదారులకు ఆయా భూములకు సంబంధించి భూ యాజయాన్య హక్కులు కల్పించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) యాక్ట్-1977కు ప్రభుత్వం సవరణలు చేసింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో ఇప్పటి వరకు 10.58 లక్షల ఎకరాల భూములకు యాక్ట్ నెంబరు 35 ఆఫ్ 2023 ప్రకారం ఆయా భూ యజమానులకు భూ యాజమాన్య హక్కులకు సంబంధించి పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమం ఒకవైపు నడుస్తోంది.



పునర్విచారణ పేరుతో విఆర్ఒ లాగిన్‌లోకి..

ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ (యాజమాన్య హక్కు) ఇవ్వడానికి ఇకెవైసి పద్ధతిని ప్రభుత్వం అవలంభిస్తోంది. ఇందుకు సంబంధించిన భూములను వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేసేందుకు గ్రామ రెవెన్యూ అధికారులు భూ యజమానిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. తొలుత విఆర్ఒ, అనంతరం తహశీల్దార్, ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ ద్వారా ఆయా సర్వే నెంబర్లకు సంబంధించిన ఫైలు అప్రూవల్ అయిన అనంతరం 22(ఎ) నుంచి తొలగించడానికి జిల్లా రిజిస్ట్రార్‌లకు పంపించడం జరుగుతుంది. ఇటీవల జరిగిన రెవెన్యూ వర్క్‌షాపులో తీసుకున్న నిర్ణయం ప్రకారం రీ వెరిఫికేషన్ కోసం విఆర్ఒ లాగిన్‌లోకి ఆయా భూముల వివరాలు పంపుతున్నట్లు కలెక్టర్లకు శనివారం నాడు పంపిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

ఏయే భూములను పరిశీలించాలి

అసైన్డ్ భూమిగా నమోదు చేయబడిన సందర్భాల్లో పట్టాదారు కాలమ్‌లో 'మిగులు భూమి', 'ప్రభుత్వ భూమి', తెలియనది, క్లైయిమ్ చేయని భూమి' పట్టాదారు అసైన్డ్ భూములు, ఎడబ్ల్యుడి భూములు లేదా ఏదైనా ఇతర వ్యక్తీకరణ (పట్టాదారు పేరు కాకుండా) ఉన్న భూములు 2023 చట్టం 35 ప్రకారం అసైన్డ్ చేయబడి, అర్హత కలిగి ఉన్నయో లేదో తనిఖీ చేయడానికి తిరిగి ధ్రువీకరించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. విఆర్ఒలు ధ్రువీకరించిన భూములను

మిగతా 5లో

బిజెపిని గద్దె దించడమే లక్ష్యం

- కార్మికవర్గం ఆ దిశగా ఉద్యమించాలి
- సిఐటియు జాతీయ సెమినార్‌లో డాక్టర్ కె హేమలత

● లోపలి పేజీలో.. ●

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణం : వడ్డే శోభనాద్రీశ్వరరావు

● లోపలి పేజీలో.. ●

గిట్టుబాటు కాని 'ఉపాధి' వేతనం

- యంత్రాలతో అధిక పనులు
- రోజువారీ వేతనం రూ.356కు పెంచాలని డిమాండ్

ఉర్దూ 'వర్సిటీ' భూములకు రక్షణ కల్పించండి

- ముఖ్యమంత్రికి రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మైనార్టీలకు విద్య అవకాశాలను పెంపొందించేలా కర్నూలు జిల్లాలో ఏర్పాటుచేసిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించిన 144 ఎకరాల భూములు కబ్జాకు గురికాకుండా రక్షణ కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆదివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్ల కాలంలో మైనార్టీల అభివృద్ధికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించిన భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో కబ్జా, అన్యాక్రాంతం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. రాయచోటి, ప్రొద్దుటూరులో మైనార్టీ బాల బాలికల హాస్టళ్లు, ఐటిఐ కాలేజీలు, కడపలో హజ్ భవన్‌లు ప్రారంభానికి నోచుకోలేదని తెలిపారు. అలాగే యునాని మెడిసిన్ రీసెర్చ్ సెంటర్ పనులను తక్షణం చేపట్టాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సిపిఎం నుంచి బాలకాశి బహిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఎం నుంచి బాలకాశిని బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల వరకు బాలకాశి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని తెలిపారు. అవినీతి, ఆర్థిక అరాచకత్వం, కార్మికవర్గ ప్రయోజనాలకు భిన్నంగా విచ్చిన్న కార్యకలాపాలకు పాల్పడినందుకు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లు పేర్కొన్నారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి : వ్యకాస

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తుపాను కారణంగా ఉపాధి దెబ్బతిన్న ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. కుటుంబానికి రూ.10 వేల నగదు, ఉచితంగా 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇల్లు కూలిపోయిన ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షలతో పక్కా గృహం నిర్మించాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చెందిపల్లి గ్రామంలో ఇంటిగోడలు కూలి మృతిచెందిన గిరిజన బాలుడి కుటుంబానికి తక్షణమే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలన్నారు. కూలిన ఇంటికి పక్కా గృహం మంజూరు చేసి నిర్మించాలన్నారు. రెండెకరాల భూమి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

11న కేబినెట్ సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 11న రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 11 గంటలకు వెలగపూడిలోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనున్నట్లు పేర్కొన్నారు.

అప్పీలు నోటీసు

మహారాజశ్రీ గుంటూరు సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జివారి కోర్టులో
ఎ.ఎస్.నెం. 69/2018
ఐ.ఎ.నెం. 427/2018
(సి.పి.సి.ఆర్డర్ 41 రూలు 5 ప్రకారం స్టే నోటీసు)

బిట్వీన్ :
కొనకంచి వెంకట పద్మావతి ...అప్పిలెంట్
మరియు
1. విన్నకోట వెంకటేశ్వరరావు వగైరా ...రెస్పాండెంట్స్

టు
1వ రెస్పాండెంటు
విన్నకోట వెంకటేశ్వరరావు, తండ్రి వీరాంజనేయులు, హిందువు, వయస్సు: 47 సం॥లు, ఉద్యోగం, నివాసం: విద్యాధరపురం, విజయవాడ టౌన్, విజయవాడ సివిల్ కోర్టు లిమిట్స్, విజయవాడ, కృష్ణా జిల్లా. (యన్.టి.ఆర్.జిల్లా)

పై వారికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు ఇ.ఎ.నెం. 29/18, ఇ.పి.నెం.25/2014, ఓ.ఎస్.నెం. 1058/11, లో కోర్టువారు ఇచ్చిన తీర్పుపై పై నెంబరు అప్పీలు చేయగా, అప్పీలులోను మరియు సత్తెనపల్లి సీనియర్ సివిజ్ జడ్జి వారి కోర్టులో ఓ.ఎస్. 1058/11 ఇ.పి.25/2014లో అమలు జరుగుచున్న ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్‌ను నిలుపుదల చేయమని కోరుచూ, ఐ.ఎ.427/18న పిటీషను దాఖలు చేయగా, అప్పీలులోను మరియు పిటీషన్‌లోను మీ నోటీసు నిమిత్తం ది. 08-12-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది. కనుక వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేక ప్లీడరుగారి ద్వారాగాని పై కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమందు అప్పీలులోను, మరియు స్టే పిటీషన్‌లోను తగు తీర్మానము జరుగునని తెలుసుకొనగలరు.

వాయిదా ది. 08-12-2023 తేదీన
(కోర్టు వారి అనుమతితో)
డి. బాపయ్య చౌదరి
అప్పిలెంట్ తరపు అడ్వకేట్

బిజెపిని గద్దె దించడమే లక్ష్యం

కార్మికవర్గం ఆ దిశగా ఉద్యమించాలి

సిఐటియు జాతీయ సెమినార్‌లో డాక్టర్ కె హేమలత

జాతీయ సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కె.హేమలత

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వినాశకర విధానాలను అమలు చేస్తోన్న బిజెపిని రాబోవు ఎన్నికల్లో గద్దె దించడమే అందరి లక్ష్యం కావాలని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత అన్నారు. సిఐటియు రాష్ట్ర పూర్వ అధ్యక్షులు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆదివారం 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మికవర్గంపై దాడి-పరిష్కారాలు' అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రయివేటీకరణ విధానాలను మరింత తీవ్రంగా అమలు చేస్తూ కార్మికవర్గంపై దాడి చేస్తోందన్నారు. కార్పొరేట్లు సంక్షోభం నుంచి బయట పడేందుకు కార్మికులపై భారాలు మోపుతోందని వివరించారు. అందులో భాగంగానే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల భద్రత, పని గంటల విషయంలో యాజమాన్యాలు ఇప్పటివరకు అనుసరిస్తోన్న చట్టవ్యతిరేక అంశాలకు చట్టబద్ధత కల్పిస్తోందని విమర్శించారు. శాశ్వత ఉద్యోగుల సంఖ్య క్రమేణా తగ్గిపోయి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఫిక్సిడ్ టెర్మ్, డైలీవేజ్ వంటి రకరకాల కేటగిరీలకు చెందిన ఉద్యోగులు పెరుగుతున్నారన్నారు. ఉద్యోగులు, కార్మికుల డిమాండ్లను వినడానికి బిజెపి ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, గనులు ఇలా ప్రజల సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసే ప్రయత్నాలను మరింత వేగం చేసిందని విమర్శించారు. దేశీయ కంపెనీల ఉత్పాదక శక్తిని చంపేసి విదేశీ కంపెనీలకు ఇక్కడి వనరులను కట్టబెడుతోందన్నారు. బ్లూ ఎకానమీ పేరుతో సముద్ర తీరంలో ఖనిజాల తవ్వకాలను అనుమతులిస్తూ మత్స్యకారులకు తీవ్ర నష్టం చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వాలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తోందని వివరించారు. లేబర్ కోడ్‌లకు అనుకూలంగా విధానాలను రూపొందించబోమని కేరళలోని వామపక్ష ప్రభుత్వం తేల్చి చెప్పడంతో ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను ఆపేసిందన్నారు. గవర్నర్లతో వేధింపులకు గురి చేస్తోందని తెలిపారు. బిజెపి విధానాలను ప్రశ్నించే గొంతుకలను నొక్కే నిరంకుశంగా నొక్కేస్తోందన్నారు.

బిజెపి తప్పుడు విధానాలను తిప్పికొట్టాలి : సిహెచ్.నర్సింగరావు

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత ఉద్యోగాలంటూ లేకుండా పోయాయని, చివరకు సైన్యంలోనూ నాలుగేళ్లకే ఇళ్లకు పంపేస్తున్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించడం వల్లే అందులోకి కార్పొరేట్లు ఎవరూ అడుగుపెట్టలేకపోయారని గుర్తు చేశారు. మోడీ, జగన్ ప్రభుత్వాలు వారి అనుయాయులు, కార్పొరేట్ల కోసం ఉన్నాయి తప్ప ప్రజలు, రైతులు, కార్మికుల కోసం కాదని అన్నారు. రైతులు, కార్మికులు ఏకతాటిపైకి వచ్చి రాబోవు ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తా

- టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు
- సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న మాజీ సిఎం దంపతులు

సింహాచలంలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - సింహాచలం (విశాఖపట్నం)

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సింహాచలం పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. గతంలో ఆ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినా క్యాబినెట్ ఆమోదం దగ్గర కొన్ని ఆటంకాలు వచ్చాయని తెలిపారు. విశాఖలోని సింహాద్రి అప్పన్నను చంద్రబాబు, ఆయన భార్య భువనేశ్వరి ఆదివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయం వద్దకు చేరుకున్న చంద్రబాబు దంపతులకు సింహాద్రి అప్పన్న ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు సిహెచ్.అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి, పురోహితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. వరుసగా మూడు రోజులపాటు రాష్ట్రంలోని ప్రముఖ దైవక్షేత్రాలను సందర్శించినట్టు తెలిపారు. తన పట్ల ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలను మరిచిపోలేనన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణం : వడ్డే శోభనాద్రీశ్వరరావు

సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో చిక్కుకుందని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో కర్నూలులో జరగనున్న ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో 'వ్యవసాయ రంగ సంక్షోభం- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి' అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు స్థానిక ఎంపిపి హాల్లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సదస్సులో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల్లో ఒకటిన్నర కోట్ల మంది వ్యవసాయం నుంచి వేరే రంగాలకు వెళ్లిపోయారన్నారు. అవసరమైన నీటి వనరులు ఉన్నా వర్షం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందని, ఇప్పటికీ 60 శాతం పంటలు వర్షం పైనే ఆధారపడి ఉన్నాయని తెలిపారు. గత కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆక్సిలరేటర్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రాముకు మోడీ ప్రభుత్వం పేరు మార్చి కేటాయింపులు తగ్గిస్తూ వచ్చిందన్నారు. కరువు నివారణకు, వ్యవసాయ ఉత్పత్తి పెరగడానికి, ఇరిగేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించాలని ఒత్తిడి చేసేలా ఎఐకెఎస్ కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానం చేయాలన్నారు. ఎకరాకు కనీసం రూ.పది వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని భూపేంద్ర సింగ్ కమిటీ సిఫార్సు చేసినా ప్రభుత్వం ఇవ్వడం లేదని వాపోయారు. ఇండియా కూటమితో చర్చించి కామన్ మినిమం ప్రోగ్రాం లాగా ఒక ప్రణాళికను అమలు చేయగలిగితే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు.

పోరాడి ప్రభుత్వాల మెడలు వంచాలి : టి సాగర్

వ్యవసాయ సంక్షోభంతో అందరికీ నష్టం వాటిల్లుతుందని ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు టి సాగర్ తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు సంక్షోభంలో ఉన్నారని, వ్యవసాయాన్ని ఆధారం చేసుకుని వ్యాపారం చేస్తున్న వాళ్లు లాభాల్లో ఉన్నారని తెలిపారు. దేశంలో ఏటా పదివేల మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అవి పాలకులు చేస్తున్న హత్యలుగానే పరిగణించాలని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని ఎన్నికల ముందు మోడీ చెప్పి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అమలైనా లాభం రాదని, మద్దతు ధరకు చట్టం తేవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు బడా పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు మాత్రమే లాభమని, సామాన్య ప్రజలకు కాదని తెలిపారు. కార్మికులు, రైతులు ఒకే తాటిపైకి వచ్చి పోరాడి ప్రభుత్వాల మెడలు వంచాలని సూచించారు. ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రైతాంగాన్ని కష్టాల నుంచి బయటపడేసేందుకు హామీలు అమలు చేయాలని ప్రభుత్వాలను ప్రశ్నించడానికి ఈ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రామచంద్రయ్య, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల ఆహ్వాన సంఘం నాయకులు ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవం గెలవాలి

- నారా లోకేష్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వైసిపి అహంకార ప్రభుత్వం పోయి, దళితుల ఆత్మగౌరవం గెలవాలన్నదే తమ లక్ష్యమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. మరో మూడు నెలల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని చేరుకుంటుందని తెలిపారు. యువగళం పాదయాత్రలో భాగంగా కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం పొన్నాడ శీలంవారిపాకలలో ఆదివారం దళిత గళం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సమస్యలను నేరుగా తెలుసుకొని, టిడిపి-జనసేన ప్రభుత్వం వచ్చాక ఎలాంటి పథకాలు అమలుచేస్తామో చెప్పడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వైసిపి ప్రభుత్వం నిలిపేసిన 27 ఎస్‌సి సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. విదేశీ విద్య, పిజి ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమాలతోపాటు ఎస్‌సి విద్యార్థుల కోసం గురుకుల కళాశాలలు, పాఠశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సబ్ ప్లాన్ నిధులను ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికే ఖర్చు చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని తెలిపారు. దళితులు గొంతెత్తి మాట్లాడే పరిస్థితి లేదని, దళిత సంఘాలను కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడనీయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఈ అరాచక ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని కోరారు. తొలుత ఆయన పిఠాపురం నుంచి పాదయాత్రను నిర్వహించారు. పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే వర్మ, మహాసేన రాజేష్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కాని 'ఉపాధి' వేతనం

- యంత్రాలతో అధిక పనులు
- రోజువారీ వేతనం రూ.356కు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉపాధి హామీ కూలీలకు కష్టానికి అనుగుణంగా వేతనం గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడింది. వర్షాభావ పరిస్థితుల వల్ల నెలకొన్న కరువుతో వ్యవసాయం దెబ్బతింది. ఉపాధి హామీ అయినా ఆదుకుంటుందని అనుకుంటే రాష్ట్రంలో ఎక్కడా ఉపాధి కూలీలకు వేతనం గిట్టుబాటు కావడం లేదు. అలాగే విపరీతంగా పెరుగుతున్న నిత్యావసర ధరలు కూడా వారిపై ప్రభావం చూపుతున్నాయి. పదేళ్ల క్రితం ఉన్న నిత్యావసర ధరలు ఇప్పుడు వంద శాతం పెరిగాయి. 2014లో ఉపాధి హామీ వేతనం రోజుకు రూ.211 ఉంటే.. 2023 నాటికి రూ.248కు మాత్రమే పెరిగింది. పదేళ్ల కాలంలో గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మారాయి. ఖర్చులు పెరిగాయి. ఒక కుటుంబానికి ప్రతిరోజూ రూ.800 లేకపోతే ఇల్లు గడవని పరిస్థితి ఏర్పడింది. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీ కూలీల వేతనాలు చాల తక్కువగా ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. దేశ వ్యాప్తంగా కేరళలో అత్యధికంగా రోజు వారీ వేతనం రూ.353 ఉండగా, హర్యానాలో రూ.350, కర్ణాటకలో రూ.320 వరకు ఉంది. మన రాష్ట్రంలో కేవలం రూ.248 మాత్రమే ఉంది. ఉపాధి పథకంలో కూలీలతో కాకుండా యాంత్రాల సహాయంతో పనులను ప్రభుత్వం చేయిస్తోంది. కాంట్రాక్టరుకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వ విధానాలను రూప కల్పన చేశారు. ప్రభుత్వ కుట్రలో భాగంగా కూలీల వేతనాల వాటాను తగ్గించారు. 2014లో కూలీల వాటా 90 శాతం, మెటీరియల్ వాటా 10 శాతం ఉండేది. 2023లో కూలీల వాటాను 60 శాతం తగ్గింది. మెటీరియల్ వాటాను 40 శాతానికి పెంచింది. గతంలో 100 రోజుల పనికి చెరువులు, కుంటలు, పూడికతీత, కందకాలు వంటి మట్టి పనులు చేసేవారు. ఇప్పుడు మెటిరీయల్ కాంపోనెంట్ 40 శాతం పెరగడంతో భవనాలు, సిమెంట్ రోడ్లు వంటి ఇతర పనులు కాంట్రాక్టర్లు చేపడుతున్నారు. యంత్రాల ప్రాముఖ్యత పెరిగింది. కూలీల ప్రాముఖ్యత తగ్గింది. గతంలో ఉపాధి హామీ పనులు ఉదమం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఉండేవి. ప్రస్తుతం రెండు పూటలా పనులు చేయిస్తున్నారు.

ఉపాధి హామీ వేతనాలను రూ.356కు పెంచాలి
వి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం

ఉపాధి హామీ వేతనం రోజుకు రూ.356కు పెంచాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని త్వరలోనే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేస్తామన్నారు. చట్టబద్ధమైన 100 రోజుల పనికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం : మంత్రి కాకాణి

ప్రజాశక్తి-తాడికొండ (గుంటూరు జిల్లా)

తక్కువ పెట్టుబడితో సాగు చేసి ఎక్కువ దిగుబడి సాధించే విధంగా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి తెలిపారు. అగ్రిటెక్-2023 ప్రదర్శన, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై సదస్సు ఆదివారం గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగింది. ఈ సదస్సులో మంత్రి కాకాని మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు, వ్యవసాయ వర్సిటీలు, టెక్నాలజీని అందిస్తున్న పరిశ్రమలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధన వలన గతంలో 31 స్థానంలో ఉన్న విశ్వవిద్యాలయం ర్యాంకింగ్ ప్రస్తుతం 13వ స్థానంలో ఉందని, త్వరలోనే కేటాయించే ర్యాంకింగ్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలోనే మొదటి పది స్థానాల్లో చోటు సంపాదించుకుంటుందని తెలిపారు. సదస్సులో వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి తదితులు పాల్గొన్నారు.

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
Finkurve Financial Services LTD. through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd. వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: 07.12.2023 వ సమయం 10 గంటలకు D. No.15-1-93/1, 1st Floor, GBC Road, Beside Janaki Devi Hospital, Upstairs Siri Dental, Ponnur, Guntur Dist. - 522124. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
ABS : ABS -38494, ABS -86764.
For More Details, Contact : Shaik Bajishaheed, Mob. 9848011704
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
Finkurve Financial Services LTD. through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd. వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: 07.12.2023 వ సమయం 10 గంటలకు CMS info Systems ltd D. No. 4-4-156 Road No. 6/1 Chandra Mouli Nagar, Guntur-522007. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
RSR Associate :
RSR -67059, RSR -86812, RSRA-62547.
For More Details, Contact : Arja Vara Prasad, Mob. 8639248394
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
Finkurve Financial Services LTD. through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd. వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: 07.12.2023 వ సమయం 10 గంటలకు Augmont Gold For All, Door No. 26-25-29, 1st Floor, Gnavoluvari Street, Gandhi Nagar, BRTS Junction, Vijayawda - 520003. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
VIJAYWADA : VIJA-26754
For More Details, Contact : Arja Vara Prasad, Mobile : 8639248394
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
పోరంకి బ్రాంచి
టివిఆర్ కాలనీ, పోరంకి, విజయవాడ.
కృష్ణా జిల్లా. ఆంధ్రప్రదేశ్ - 521137

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
SCHEDULE 6 (RULE 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ & ఇంటరస్ట్ చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి బ్రాంచి** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 9 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ విష్ణు కన్‌స్ట్రక్షన్స్,** డి.నెం. 9-185, ఫస్ట్ ఫ్లోర్, ప్లాట్ నెం. 31, పద్మావతి గార్డెన్స్, ఫేస్ 1, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా, ఎపి - 521137. **2. శ్రీ కొండపల్లి విజయ మోహనరావు,** తండ్రి : సుబ్బారావు, డి.నెం. 10-42/3, పోరంకి రూరల్, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా, ఎపి - 521137. **3) శ్రీమతి పాటూరి వెంకట దీపిక,** డి.నెం. 9-185, ప్లాట్ నెం. 31, పద్మావతి గార్డెన్స్ ఫేస్ -1, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా, ఎపి - 521137 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 60,47,841.45/- (అక్షరాలా అరవై లక్షల నలభై ఏడు వేల ఎనిమిది వందల నలభై ఒక్క రూపాయి నలభై ఐదు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 30-05-2023న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 9 ప్రకారము **తేది. 29-11-2023** న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవిలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. రూ. 60,47,841.45/-**+ వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. (డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత చెల్లించినవి మినహాయించవలయును).

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుభందమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

ఆస్తి యొక్క సమానమైన / నమోదిత తనఖా క్రింద వివరించబడ్డాయి. శ్రీమతి పాతూరి వెంకట దీపిక, భర్త : పాతూరి ప్రసాద్ గారి పేరిట కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామ పంచాయితీ, దగ్గరి డి.నెం. 10-1, ఆర్.ఎస్.నెం. 313/1ఎ, 313/1బి, 313/2, 131/3ఎ, 313/బి వద్ద ప్లాట్ నెం. 5కి చెందిన 296.38 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు** : 33 అ॥ వెడల్పు గల గ్రావెల్ రోడ్డు, **దక్షిణం** : ప్లాట్ నెం. 4, **పడమర** : ప్లాట్ నెం. 1, **ఉత్తరం** : 40 అ॥ వెడల్పు గల గ్రావెల్ రోడ్డు.

తేది : 29-11-2023
స్థలం : పోరంకి
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
పోరంకి బ్రాంచి
టివిఆర్ కాలనీ, పోరంకి, విజయవాడ.
కృష్ణా జిల్లా. ఆంధ్రప్రదేశ్ - 521137

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
SCHEDULE 6 (RULE 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ & ఇంటరస్ట్ చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి బ్రాంచి** యొక్క అధీకృత అధికారి ...

తేది : 29-11-2023
స్థలం : పోరంకి
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వికారాబాద్‌లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ తన హవా చాటుకుంది. గతంలో ఇక్కడ బలంగా ఉన్న కాంగ్రెస్ మళ్లీ పూర్వ వైభవాన్ని సంపాదించింది. జిల్లాలో మొత్తం 12 స్థానాలు ఉంటే కాంగ్రెస్ ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. ఐదు చోట్ల బిఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. అయితే వికారాబాద్ జిల్లాలోని నాలుగు చోట్ల కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. గతంలో తాండూర్ తప్ప.. మిగిలినవి బిఆర్ఎస్ సిట్టింగ్ సీట్లు కావడం విశేషం.

కొత్తగూడెంలో కూనంనేని జయభేరి

- 26,214 ఓట్ల మెజార్టీతో జలగంపై గెలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏకైక జనరల్ నియోజకవర్గమైన కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు ఘన విజయం సాధించారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకటరావుపై 26,214 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అధికార పార్టీ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు మూడో స్థానానికి పరిమితమయ్యారు. కూనంనేని సాంబశివరావుకు 79,155 ఓట్లు రాగా జలగం వెంక్రటావుకు 52,971, వెంకటేశ్వరరావుకు 37,226 ఓట్లు పోలయ్యాయి. కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం 2,43,846 ఓట్లు ఉండగా 1,86,347 ఓట్లు పోలయ్యాయి. 76.56 శాతం పోలింగ్ జరిగింది.

కెసిఆర్, హరీశ్‌రావుకు తగ్గిన మెజార్టీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల మెజార్టీ భారీగా తగ్గింది. గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీతో పోల్చుకుంటే ఈ సారి తక్కువ మెజార్టీయే వచ్చింది. సిద్దిపేటలో హరీశ్‌రావు 1,05,514 ఓట్లు సాధించి ఘన విజయం సాధించారు. సమీప కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణపై హరీశ్‌రావు 82,308 ఓట్ల మెజార్టీ సాధించారు. గత ఎన్నికల్లో 1,18,699 ఓట్ల మెజార్టీ సాధించి తెలుగు రాష్ట్రాల్లో రికార్డు మెజార్టీ సాధించారు. గతం కంటే ఈ సారి 36,391 ఓట్లు తగ్గాయి. ఇక్కడ పోటీ చేసిన కాంగ్రెస్, బిజెపి, బిఎస్‌పి ముగ్గురు అభ్యర్థులూ 20 వేలకు పైగా ఓట్లు పొందారు. దాంతో హరీశ్‌రావు మెజార్టీ బాగా తగ్గింది. గత ఎన్నికల్లో ఆ పార్టీల అభ్యర్థులకు పది వేల ఓట్లైనా రాలేదు. గజ్వేల్ నుంచి కెసిఆర్ మూడో సారీ గెలిచారు. ఆయనకు 1,11,684 ఓట్లు వచ్చాయి. సమీప బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌పై 45,031 ఓట్ల మెజార్టీ సాధించారు. గత ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి గెలిచిన కెసిఆర్‌కు 50 వేల మెజార్టీ వచ్చింది. ఈ సారి గట్టి పోటీ ఉండటంతో కెసిఆర్ మెజార్టీ ఐదు వేలు తగ్గింది.

మంత్రినే ఓడించి.. తొలి ఎన్నికల్లోనే సత్తా..

- చరిత్ర సృష్టించిన 'యశస్విని'
- పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి 26 ఏళ్ల యశస్వినిరెడ్డి విజయం సాధించి చరిత్రను సృష్టించారు. సమీప ప్రత్యర్థి, బిఆర్ఎస్ అభ్యర్థి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై అనూహ్యంగా బరిలోకి దిగి తొలి ఎన్నికలోనే సత్తా చాటారు. పాలకుర్తి నియోజకవర్గం గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండాను మొట్టమొదటిసారిగా ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఝాన్సీ రెడ్డి టికెట్టు ఆశించగా.. భారత పౌరసత్వం రాకపోవడంతో ఆమె కోడలు యశస్విని రెడ్డిని రాజకీయ రంగ ప్రవేశం చేయించారు. కాగా, 2018లో బిటెక్ పూర్తి చేసిన యశస్విని రెడ్డి.. వివాహం అనంతరం అమెరికా వెళ్లిపోయారు. అక్కడ కొంతకాలం రియల్‌ఎస్టేట్ సంస్థలో పనిచేశారు. అతి చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు.

26 ఏళ్లకే అసెంబ్లీకి మైనంపల్లి రోహిత్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతిచిన్న వయసులోనే అసెంబ్లీ మెట్లు ఎక్కిన వారిలో మైనంపల్లి రోహిత్‌రావు ఒకరు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కొడుకైన మైనంపల్లి రోహిత్‌రావు విదేశాల్లో వైద్య విద్యలో పిజి చేశారు. ఆర్నెళ్ల క్రితమే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. తండ్రి ఎమ్మెల్యేగా గెలిచిన బిఆర్ఎస్‌లో చేరి మెదక్ నియోజకవర్గంలో క్రియాశీలకంగా పని చేశారు. మైనంపల్లి ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గమంతటా సేవా కార్యక్రమాలు చేశారు. విద్య, వైద్యం కోసం ఆర్థిక సహాయం చేస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. బిఆర్ఎస్ టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌లో చేరిన తండ్రికొడుకులిద్దరికీ టికెట్లు వచ్చాయి. దీంతో మైనంపల్లి రోహిత్‌రావు మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బిఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. 1997 డిసెంబర్ 1న జన్మించిన రోహిత్‌రావు వయసు 26 మాత్రమే. అతి చిన్న వయసులో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

ప్రగతి భవన్... ఇకనుంచి ప్రజాభవన్

- ఈ విజయం అమరవీరులకు అంకితం
- ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత : రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'ఆత్మగౌరవ జెండాను ఆకాశమంత ఎత్తున ఎగరేసిన కొడంగల్ గడ్డకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. కొన ఊపిరి వరకు కొడంగలే శ్వాసగా జీవిస్తా. కష్టకాలంలో భుజాలు కాయలు కాసేలా కాంగ్రెస్ జెండాను మోసిన ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకుని చూసుకుంటా. ఈ గడ్డపై ప్రతి బిడ్డ బతుకులో వెలుగునింపే బాధ్యత తీసుకుంటా. దేశానికి కొడంగల్‌ను ఒక మోడల్‌గా నిలబెడతా.'

- సామాజిక మాధ్యమాల్లో రేవంత్ స్పందన ఇది.

తెలంగాణ ముఖ్యమంత్రి క్యాప్ ఆఫీసు ప్రగతి భవన్‌ను ఇక నుంచి ప్రజాభవన్‌గా మారుస్తామని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజాతీర్పును అమరులకు అంకితం ఇస్తున్నట్టు చెప్పారు. ప్రజల తీర్పుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్టు తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో గాంధీ భవన్‌కు వచ్చిన రేవంత్ ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా భవన్‌లో రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, విహెచ్, విజయశాంతి తదితరులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 2009 డిసెంబర్ 3న శ్రీకాంతచారి అమరుడయ్యారని గుర్తు చేశారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చి శ్రీకాంతాచారికి ఘన నివాళులర్పించారని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు కృతజ్ఞత తెలిపే అవకాశం ఇచ్చినందుకు ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం అప్పగించి మాపై మరింత బాధ్యతను పెంచారని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా తెలంగాణలో రాహుల్ గాంధీ స్ఫూర్తిని నింపారని, ఆయన అండతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధించిందని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధిస్తామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షాలు హేతుబద్ధంగా వాదించేందుకు కాంగ్రెస్ పార్టీ అవకాశమిస్తుందన్నారు. ప్రభుత్వ ఏర్పాటు కార్యక్రమానికి విపక్షాలతోపాటు అందరినీ ఆహ్వానిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సిపిఐ, జనసమితితోపాటు సిపిఎంను కూడా కలుపుకునిపోతామని, వారి సలహాలు తీసుకుంటామని ప్రకటించారు. సచివాలయ గేట్లు సామాన్యులకు తెరిచే ఉంటాయన్నారు. కూటమి గెలుపునకు సహకరించిన సిపిఐకి, కోదండరాంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా తీర్పును బిఆర్ఎస్ శిరసావహించాలని కోరారు. ప్రభుత్వ ఏర్పాటుకు వారి వైపు నుంచి సహకారం ఉంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్‌ను అభినందిస్తూ ట్వీట్ చేసిన మంత్రి కెటిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ ఫలితంతోనైనా కనువిప్పు కలగాలి

- రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు మేల్కోవాలి
- ప్రజాప్రణాళికతో ఎన్నికల క్యాంపెయిన్ : ఎం.ఎ గఫూర్

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

బిజెపితో లోపాయికారీ పొత్తు ద్వారా వ్యతిరేక ఫలితాలు తథ్యమని తెలంగాణ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. సిపిఎం కడప జిల్లా కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు తెలంగాణ ఎన్నికల ఫలితం కనువిప్పు కావాలన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ సర్కారు కొన్ని సంక్షేమ చర్యల్ని చేపట్టినప్పటికీ ఓటమి చెందడాన్ని గమనించాలని తెలిపారు. కేంద్రంలోని బిజెపి సర్కారు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. పోలవరం మొదలుకొని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వరకు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి కల్పన అంశాల్లో జగన్ ప్రభుత్వం నిరాశపరిచిందన్నారు. రాష్ట్రంలో కరువు సహాయక చర్యలు లేవని విమర్శించారు. కడపలో ప్రభుత్వ రంగంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని ఉద్యమిస్తే జిందాల్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు చొరవ తీసుకున్నప్పటికీ, ఎటువంటి పురోగతి లేదన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు కల్పించడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా ద్రోహం చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి రావాల్సిన హక్కుల గురించి ప్రశ్నించిన దాఖలాల్లేవని విమర్శించారు. అన్ని సందర్భాల్లోనూ టిడిపి కూడా బిజెపిని సమర్థిస్తోండగా జనసేన ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉందన్నారు. రాష్ట్రంలో రూ.60 పెట్రోల్, వంట గ్యాస్ రూ.400, నిరుద్యోగభృతి ఇవ్వాలని, ఇంకా 31 డిమాండ్లతో రూపకల్పన చేసిన ప్రజాప్రణాళిక సాధనకు వచ్చే ఎన్నికల్లోకి వెళ్తామన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపెయిన్ చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఖరితోనే 3 రాష్ట్రాల్లో బిజెపి : నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలను కలుపుకొనిపోవడంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో విఫలం అయినందునే బిజెపి గెలిచిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. ఆదివారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో తమపార్టీ కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేసిందన్నారు. కొత్తగూడెంలో సిపిఐ అభ్యర్థిగా కూనంనేని సాంబశివరావు పోటీ చేసి గెలుపొందారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ మిత్రులను సమీకరించడంతోపాటు యువతకు ప్రాముఖ్యత ఇచ్చిందని తెలిపారు. కెసిఆర్ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేశారని విమర్శించారు. రాజకీయాల్లో ప్రజలు అహంభావాన్ని సహించరని అందుకే కెసిఆర్‌ను ఓడించారన్నారు. సిపిఐ ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు ఒక్కడైనా అసెంబ్లీలో తన గళాన్ని ప్రజల పక్షాన గట్టిగా వినిపిస్తారని తెలిపారు. మిగిలిన మూడు రాష్ట్రాల్లో ఇండియా వేదికలో వున్న పార్టీలను కలుపుకుపోలేదన్నారు. అందుకే అక్కడ బిజెపి గెలవగలిగిందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఇండియా వేదిక బలపడాలంటే అందర్నీ కలుపుకుపోవాలన్నారు. తెలంగాణలో కెసిఆర్‌ను గెలిపించడానికి జగన్‌మోహన్‌రెడ్డి చాలా ప్రయత్నాలు చేశారని విమర్శించారు. అర్ధరాత్రి పోలీసులను నాగార్జున సాగర్ వద్దకు పంపి, సెంటిమెంట్ రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని తెలిపారు. అయినా తెలంగాణ ప్రజలు కెసిఆర్, జగన్‌మోహన్‌రెడ్డిలకు శృంగభంగం చేశారని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల తీర్పు రేపు ఆంధ్రప్రదేశ్‌లో పునరావృతం అవుతుందని భావిస్తున్నామని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కూడా కెసిఆర్ తరహాలో రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు, ప్రజాసంఘాలకు ఏమాత్రం విలువ ఇవ్వరని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డిని గద్దె దింపడమే సిపిఐ లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు.

కారెక్కిన ఎమ్మెల్యేలు.. కంగుతిన్నారు !

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్, టిడిపిల నుంచి గెలిచి బిఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు ఓటర్లు షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ నుంచి 12 మంది గంపగుత్తగా కారెక్కారు. వారిలో పది మంది ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో ఘోరపరాజయం పాలయ్యారు. టిడిపిలో గెలిచి గులాబీ కండువా కప్పుకున్న ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటమిపాలయ్యారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాత్రం గెలుపొందారు. ఓడిపోయిన వారిలో కొత్తగూడెం నుంచి గెలుపొందిన వనమా వెంకటేశ్వర్‌రావు, పినపాకలో రేగా కాంతారావు, ఇల్లెందులో హరిప్రియ నాయక్, నకిరేకల్‌లో చిరుమర్తి లింగయ్య, భూపాలపల్లిలో గండ్ర వెంకట రమణారెడ్డి, పాలేరులో ఉపేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డిలో సురేందర్, కొల్లాపూర్‌లో హర్షవర్ధన్ రెడ్డి, తాండూరులో పైలెట్ రోహిత్‌రెడ్డి, ఆత్రం సక్కు ఉన్నారు. వీరంతా కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో చేరినవారే. అశ్వారావుపేటలో మెచ్చా నాగేశ్వర్‌రావు, సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య టిడిపి నుంచి బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి నిరాశే మిగిలింది.

కారు దిగి 'చేయి' పట్టినోళ్లు గెలిచారు !!

బిఆర్ఎస్ నుంచి టికెట్లు ఆశించి...సీట్లు రాకపోవడంతో కాంగ్రెస్‌లో చేరిన వేముల వీరేశం (నకిరేకల్), జూపల్లి కృష్ణారావు (కొల్లాపూర్), కసిరెడ్డి నారాయణ రెడ్డి (కల్వకుర్తి), మందుల సామేల్ (తుంగతుర్తి), తుమ్మల నాగేశ్వరరావు (ఖమ్మం), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (పాలేరు), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), కోరం కనకయ్య (ఇల్లందు) ఈ జాబితాలో ఉన్నారు. బిజెపి నుంచి కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మునుగోడు), జి.వివేక్ వెంకటస్వామి (చెన్నూర్) గెలిచారు.

రేవంత్‌ను కలిసిన డిజిపి

- ఇసి ఆగ్రహం..సస్పెన్షన్
- నూతన పోలీస్‌బాస్‌గా రవిగుప్తా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలు ఫలితాలు వెలువడుతుండగానే పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని డిజిపి అంజనీకుమార్ కలవడం, బొకే ఇచ్చి అభినందించడం వివాదాస్పదంగా మారింది. ఎన్నికల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, ఆయనపై సస్పెన్షన్ వేటువేసింది. ఆదివారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. కౌంటింగ్ ప్రక్రియలో మొదటి నుండి కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగిన విషయం తెలిసిందే. దీంతో ఉదయం పది గంటల నుండే రేవంత్‌రెడ్డి ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ గెలుపు ఖాయం కావడంతో డిజిపి అంజనీకుమార్,సిఐడి చీఫ్ మహేష్ భగవత్, మరో ఐపిఎస్ అధికారి సంజయ్‌కుమార్ రేవంత్ ఇంటికి వెళ్లారు. ఆయనకు బొకే ఇచ్చి అభినందిచ్చిన దృశ్యాలు మీడియాలో వచ్చాయి. రేవంత్ ఇంటి వద్ద, గాంధీభవన్ వద్ద భద్రతను సమీక్షించడానికి ఉన్నతాధికారులు అక్కడికి వచ్చినట్లు పోలీసువర్గాలు తెలిపాయి. అయితే, దీనిని ఇసి తీవ్రంగా తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయన్ను సస్పెండ్ చేసింది. ఆయనతో వెళ్లిన అధికారులకు నోటీసులు జారీ చేసింది. అంజనీకుమార్ స్థానంలో నూతన డిజిపిగా సీనియర్ ఐపిఎస్ అధికారి రవిగుప్తాను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఆనవాయితీకి పోచారం బ్రేక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ఆనవాయితీకి అడ్డుకట్ట వేస్తూ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నిజాంబాద్ జిల్లా బాన్సువాడ నుంచి గెలిచారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ స్పీకర్‌గా పనిచేసిన వారిలో అత్యధిక మంది ఆ తరువాత ఎన్నికల్లో గెలవడం తెలుగు రాష్ట్రాల్లో కనిపించలేదు. గతంలో స్పీకర్లుగా పనిచేసిన వారిలో యనమల రామకృష్ణుడు మినహా మధుసూదనా చారి, కిరణ్ కుమార్ రెడ్డి, నాదెండ్ల మనోహర్, సురేష్ రెడ్డి, ప్రతిభా భారతి తదితరులు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మధుసూధనాచారి భూపాల్‌పల్లిలో రెండోసారి ఓటమితో ఈ నమ్మకం మరింత బలపడింది. ఈ భయంతో అసెంబ్లీ స్పీకర్ పదవి అంటేనే ఎవరూ ముందుకు రాలేదు. అప్పుడున్న పరిస్థితుల్లో సిఎం కెసిఆర్ పోచారంను ఒప్పించి స్పీకర్ పదవి ఇచ్చారు. స్పీకర్ల ఓటమి ఆనవాయితి భయంతో ఒక దశలో పోచారం పోటీ చేసిన బాన్సువాడ స్థానం నుంచి ఆయన కుమారుడిని బరిలో నిలపాలని అనుకున్నప్పటికి చివరికి ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించారు. బాన్సువాడ నుంచి వరుసగా నాలుగోసారి ఘన విజయం సాధించి రికార్డు సృష్టించారు.

రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం ఎంత

- కాంగ్రెస్ గెలుపు వైసిపికి ఖేదం-టిడిపికి మోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపుపై రాష్ట్ర రాజకీయాలలో ప్రభావం ఎంత అనేది చర్చనీయంశం అయ్యింది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుపై వున్న రాజకీయ వైరం బిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్య స్నేహ బంధాన్ని గట్టిగా పెంచింది. 2014 ఎన్నికల్లో తెలంగాణలో బిఆర్ఎస్, రాష్ట్రంలో వైసిపి గెలుస్తుందనే అంచనాల్లో తెలంగాణ బిఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి గెలుపొందింది. ఆ ఎన్నికల్లో వైసిపి తరపున గెలుపొందిన ప్రజా ప్రతినిధులు కూడా బిఆర్ఎస్‌లో చేరినా జగన్‌మోహన్‌రెడ్డి సీరియస్‌గా తీసుకోకపోగా తెలంగాణ రాజకీయాల నుంచి తప్పుకుని కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం అయ్యారు. కెసిఆర్ 2018లో బిఆర్ఎస్ ముందస్తుకు పోయినపుడు బిఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌తో టిడిపి పొత్తుపెట్టుకుని ఎన్నికలకు పోయినా బిఆర్ఎస్ గెలుపొందడంతో 2019 ఎన్నికలకు రాష్ట్రంలో వైసిపికి జోష్ నింపినట్లయింది. హైదరాబాద్‌లో వున్న టిడిపి సానుభూతిపరుల నుండి ఆ పార్టీకి పార్టీ ఫండ్ అందకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టడి చేసిందని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ ఎన్నికల్లో టిడిపి కేవలం 23 సీట్లకు పరిమితం అయ్యింది. ప్రస్తుతం తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే చంద్రబాబు నాయుడుకు విధేయుడిగా వున్న రేవంత్‌రెడ్డి సిఎం అయితే తమకు ప్రతికూలంగా వుంటుందని కెసిఆర్ గెలుపు కోసం వైసిపి సహకరించిందని అనేక మీడియా కథనాలొస్తున్నాయి. ఈ ఎన్నికల్లో హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో కొన్ని నియోజకవర్గాలను మినహాయిస్తే చాలా నియోజకవర్గాల్లో టిడిపి కార్యకర్తలు తమ పార్టీ అభ్యర్థులు బరిలో లేరని టిడిపి జెండాలతో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయడంతో ఈ గెలుపుపట్ల టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ముందు కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి తెలుగు తమ్ముళ్లు సంబరాల్లో మునిగితేలారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల మీద దృష్టి సారిస్తే దాని ప్రభావం తమపై పడుతుందని వైసిపి ఆందోళన చెందుతోంది. మొత్తంగా పొరుగు రాష్ట్ర ఎన్నికల ఫలితాలు 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రధాన పార్టీల భవిష్యత్‌కు నిర్ణయాత్మకం అవుతుందని చర్చ జరుగుతోంది.

ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ సంబరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయడంతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ శ్రేణులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నేతృత్వంలో ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. రాహుల్ గాంధీ చిత్రపటానికి గిడుగు రుద్రరాజు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రదర్శించిన సమన్వయం, సమైక్యత స్ఫూర్తితో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగా తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించినట్లు తెలిపారు. ఇదే విధానంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాల సహకారంతో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామని రుద్రరాజు పేర్కొన్నారు. ఈ సంబరాల్లో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, నరహరశెట్టి నరసింహారావు, ఆర్ రామ్మూర్తి, కొలనుకొండ శివాజీ, డి మురళి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

కొడంగల్‌లో రేవంత్ భారీ విజయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొడంగల్‌లో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి భారీ విజయం సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిపై సుమారు 33,015 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కొడంగల్‌లో మొత్తం 2,36,625 ఓట్లు ఉన్నాయి. ఇందులో 1,07,429 ఓట్లు రేవంత్‌రెడ్డికి రాగా 74,897 ఓట్లు పట్నం నరేందర్‌రెడ్డికి పోలయ్యాయి. ప్రతి రౌండ్‌లోనూ రేవంత్‌రెడ్డి ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. కాగా, రేవంత్ రెడ్డికి పోస్టల్ బ్యాలెట్‌లో 871 ఓటు రాగా, పట్నం నరేందర్ రెడ్డికి 388 ఓట్లు పోలయ్యాయి. పరిగిలో నిర్వహించిన ఈ ఎన్నికల కౌంటింగ్‌లో రేవంత్‌రెడ్డి గెలుపును కొడంగల్ రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్ ప్రకటించారు. రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి గెలుపొందినట్టు నియామకపత్రం అందజేశారు. కాగా, కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి మూడోసారి విజయం సాధించారు. 2009, 2014లో టిడిపి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి బిఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన రేవంత్.. బిఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిపైనే విజయం సాధించారు.

అప్రజాస్వామిక, అవకాశవాద వైఖరిని తిరస్కరించిన ప్రజలు

- కాంగ్రెస్ విజయం సాధించడాన్ని ఆహ్వానిస్తున్నాం : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఆర్ఎస్ ఓడిపోయిందని, కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తెలిపింది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అప్రజాస్వామిక, అవకాశవాద వైఖరిని ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించడాన్ని ఈ ఫలితాలు వెల్లడిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యతిరేకతను వినియోగించుకుని కాంగ్రెస్ పార్టీ పూర్తి విజయం సాధించడాన్ని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. బిజెపి ఓట్లు, సీట్లు పెరగడం మతోన్మాద ప్రమాదం రాష్ట్రంలో తగ్గలేదని ఈ ఫలితాలు సూచిస్తున్నాయని వివరించారు. లౌకిక శక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో సిపిఎం చివరి దశలో ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రెండు పార్టీల మధ్య హోరాహోరీగా సాగిన పోటీ, రూ.కోట్ల డబ్బు ప్రవాహం, చివరి నిమిషంలో ఒంటరిగా పోటీ చేయాల్సి రావడంతో పార్టీ ఓటింగ్ కొంత చెదిరినట్టు గమనించామని వివరించారు. ఏమైనా ఫలితాలను లోతుగా పరిశీలించి లోపాలను సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కొత్త ప్రభుత్వం పట్ల ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో సిపిఎం నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పార్టీకి ఓటేసిన ఓటర్లకు, అననుకూల పరిస్థితుల్లోనూ అహర్నిశలూ కృషి చేసిన పార్టీ శ్రేణులకు, సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

బర్రెలక్కకు 5,754 ఓట్లు

హైదరాబాద్: కొల్లాపూర్ నుండి ఎన్నికల బరిలోకి దిగిన నిరుద్యోగ అభ్యర్థి కర్నె శిరీష (బర్రెలక్క)కు 5,754 ఓట్లు వచ్చాయి. రాష్ట్రంలోని నిరుద్యోగంపై వ్యంగ్యంగా ఆమె సోషల్‌మీడియాలో చేసిన పోస్టు వైరల్ అయిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఆమెపై కేసులు పెట్టింది. దీనికి నిరసనగా ఆమె ఎన్నికల బరిలోకి దిగిన విషయం కూడా సోషల్‌మీడియాలో సెన్సేషనల్ అయింది. దీంతో బర్రెలక్కకు ఎన్ని ఓట్లు వస్తాయన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు 93,609 ఓట్లతో గెలుపొందారు. బిఆర్ఎస్‌కు చెందిన బి. హర్షవర్ధన్‌రెడ్డికి 63,678 ఓట్లు, బిజెపికి చెందిన ఎ. సుధాకర్‌రావుకు 20,389 ఓట్లు వచ్చాయి. బర్రెలక్క నాల్గవ స్థానంలో నిలిచింది. ఫలితాల అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓటమితో తాను నిరాశ చెందడం లేదని, తన శక్తి మేరకు సమస్యల పరిష్కారం కోసం పోరాడతానని ఆమె చెప్పారు.

ఉప ఎన్నిక తప్పింది...

- కామారెడ్డిలో రేవంత్, కెసిఆర్ ఓటమి
- రెండు చోట్లా ఓడిన బిజెపి నేత ఈటల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు విలక్షణ తీర్పును ఇచ్చి ఉప ఎన్నికను తప్పించారు. గజ్వేల్, కామారెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గాల నుంచి ముగ్గురు ప్రధాన పార్టీల నేతలు పోటీకి దిగడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒక్కొక్కరు రెండు చోట్ల పోటీ పడటంతో ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందోనని అంతా ఎదురు చూశారు. ఒక వ్యక్తి రెండు చోట్ల పోటీ చేసేందుకు వీలుంటుంది. ఒక వేళ గెలిస్తే ఆ రెండు చోట్లా ఎమ్మెల్యేగా కొనసాగడం కుదరదు. ఏదొక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. అందుకే ఓటర్లు తెలివిగా ఆలోచించి ఓటేశారు. ఎక్కడా ఉప ఎన్నిక రాకుండా జాగ్రత్త పడ్డారు. బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ ఈసారి గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీ చేశారు. మరోవైపు రేవంత్‌రెడ్డి సైతం సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు కామారెడ్డిలో నామినేషన్ వేశారు. ఇద్దరూ స్థానికేతరులు కావడంతో ఓటర్లు బిజెపి అభ్యర్థి కాటిపల్లి వెంకట రమణారెడ్డి వైపు మొగ్గు చూపారు. కెసిఆర్ గజ్వేల్‌లో, రేవంత్ కొడంగల్‌లో మాత్రమే గెలిచారు.

బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ సొంత నియోజకవర్గం హుజూరాబాద్‌తో పాటు గజ్వేల్‌లోనూ పోటీ చేశారు. రెండు చోట్లా ఆయన ఓటమి పాలయ్యారు.

అసెంబ్లీకీ 15 మంది డాక్టర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో 15 మంది డాక్టర్లు విజయం సాధించారు. వీరిలో 11 మంది కాంగ్రెస్‌కు ఒకరు బిజెపికి, ముగ్గురు బిఆర్ఎస్‌కు చెందిన వారు గెలిచారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన వారిలో డాక్టర్ రామ్ చందర్ నాయక్ (డోర్నకల్), డాక్టర్ వంశీ కృష్ణ (అచ్చంపేట), డాక్టర్ మురళీ నాయక్ (మహబూబాబాద్), డాక్టర్ సత్యనారాయణ (మానకొండూరు), డాక్టర్ మైనంపల్లి రోహిత్ (మెదక్), డాక్టర్ పర్ణిక రెడ్డి (నారాయణపేట్), డాక్టర్ సంజీవ రెడ్డి (నారాయణఖేడ్), డాక్టర్ వివేక్ వెంకటస్వామి (చెన్నూరు), డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి (నాగర్ కర్నూల్), డాక్టర్ భూపతి రెడ్డి (నిజామాబాద్ రూరల్), డాక్టర్ రాగమయి (సత్తుపల్లి) ఉన్నారు. బిఆర్ఎస్ నుంచి డాక్టర్ తెల్లం వెంక్రటావు (భద్రాచలం), డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ (కోరుట్ల), డాక్టర్ సంజయ్ (జగిత్యాల), బిజెపి నుంచి డాక్టర్ పాల్వాయి హరీశ్ (సిర్పూర్) గెలుపొందారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాలకుగానూ 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలిచిన అభ్యర్థులు వృత్తిరీత్యా డాక్టర్లు కావడం విశేషం. మొత్తం అసెంబ్లీలో వీరు 17.85 శాతంగా ఉండటం గమనార్హం.

అసెంబ్లీలోకి 9 మంది మహిళా ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీలో ఈ సారి మహిళల సంఖ్య కాస్త పెరిగింది. గత ఎన్నికల్లో ఆరుగురు మహిళా అభ్యర్థులు విజయం సాధించగా ఈ పర్యాయం వారి సంఖ్య తొమ్మిదికి చేరింది. వీరిలో నలుగురు తొలిసారిగా ఎన్నికైనవారే ఉండటం విశేషం. కొత్తగా విజయం సాధించినవారిలో కంటోన్మెంట్ (ఎస్‌సి) నుంచి లాస్య నందిత, పాలకుర్తిలో మామిడాల యశస్విని, నారాయణ్‌పేట్‌లో పర్ణికారెడ్డి, సత్తుపల్లి (ఎస్‌సి)లో మట్టా రాగమయి ఉండగా, ఆసిఫాబాద్‌లో కోవ లక్ష్మి, నర్సాపూర్‌లో సునితా లక్ష్మారెడ్డి, మహేశ్వరంలో సబితా ఇంద్రారెడ్డి, వరంగల్ తూర్పులో కొండా సురేఖ, ములుగులో సీతక్క, కోదాడలో పద్మావతి రెడ్డి మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. గత ఎన్నికల్లో సబితా ఇంద్రారెడ్డి, గొంగిడి సునిత, హరిప్రియా నాయక్, రేఖా నాయక్, సీతక్క, పద్మా దేవేందర్ రెడ్డి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఏడుగురు మహిళలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించించగా, వారిలో లాస్య నందిత, కోవ లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డి మాత్రమే విజయం సాధించడం గమనార్హం.

తెలంగాణ ఉద్యోగుల విజయం : టిఎన్‌యుఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో అధికార పార్టీ బిఆర్ఎస్ ఉద్యోగులను, ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయడంతో ఆ పార్టీ ఓటమి చెందిందని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం పేర్కొంది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సకాలంలో పిఆర్‌సి, డిఎ, వేతనాలను ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఒకటో తేదీనే వేతనాలు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పడంతో ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగుల తీర్పు స్పష్టంగా కనిపించిందన్నారు.



"అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినవాడు
నాకు ఆరాధ్యుడు "

– కాళోజీ



అరుణ చంద్రుడు

చైతన్య జీవనదులన్నీ
కలిసిన సంగమంలా
చెమట నెత్తురు కన్నీటితో
ఎగసిపడే ఎర్రసముద్రాన్ని
నేను చూసాను
నినదించే
జనజాగత పతాకాలను చూసాను

ఆ ఎర్రమందారం తోట
నా గుండెల్లో పూచింది
ఈ కార్తీక పౌర్ణమి రోజు
అరుణవర్ణ చంద్రుడు ఉదయించాడు

కార్మికులు కర్షకులంటే
ఈ నేలతల్లి చేతిలో కంకీ కొడవలి
ఆ కొడవలి వరికోతలే కాదు
అవినీతి అణచివేత రాజ్యహింస
అహంకారాలను కోయగలదు

గాజాలో కనిపించిన విధ్వంసమైతే
భరతభూమిలో అధికారం
అగుపించని మందుపాతర
స్వేచ్ఛను మానవహక్కులను పాతరేస్తూ...

కార్మికులు కర్షకులు
దేశానికి రెండు కళ్ళైతే
కనుగుడ్లు బయటకొచ్చి
నెత్తురోడుతున్న భరతమాత ...
అన్యాయాలపై అక్రమాలపై
అవినీతి రాజ్యంపై తిరగబడే
ఆ శ్రమ పాదముద్రలకు
కదిలే అగ్నిపూల చెట్లకు
ఎగిరే ఆ నెత్తుటి జెండాలకు
నా లాల్ సలామ్

ఇప్పుడు దేహాలు హదయాలే కాదు
దేశమే యుద్ధభూమిలో...
మన చేతిలో ఓట్లే బోయీలై
ప్రజాస్వామ్యాన్ని పల్లకిలో ఊరేగిద్దాం!

– సరికొండ నరసింహరాజు
9398254545

వాక్యాంతం లోపు ...

దారులన్నీ మూసుకుని పోయాక
వెతకటం ఆపేశాను
గాలికి చెదపట్టదు
ఆశబోతు మనసులకు
ఇప్పుడు నిద్రపట్టదు
మనిషితనం కోసం యిక వెతకను
మానవత్వం జాడ ఎవరినీ అడగను
ఇప్పుడు స్వరంలో కోరస్ కోసం
ఎదురుచూపు లేదు
అంతా ఏకాంత గానమే
ఆయుష్షు ఆవిరయే లోపు
మనిషి ఆనవాళ్ళు దొరుకుతాయో లేదో
వాక్యాంతం లోపు
మొగ్గలు విచ్చుకున్నా
పరిమళం లేదనే
పూల కన్నీళ్ళ బాధ చూస్తానేమో!
నెర్రెలు బారిన నేలని చూసి
నెత్తిన గుడ్డేసుకున్న రైతు
కంటి చినుకులు కనబడతాయేమో!
అంతా పంచుకోవటమే
అన్నిటా తెంచుకోవటమే
అనుబంధాలు యిక అందని ద్రాక్షలే..
ఊహలేవి అల్లుకోవటం లేదు
అంతా తునకలు తునకలుగా
కళ్ళకు ఉల్లాసమిచ్చే
రంగుల సీతాకోకలు కనిపించవు
కాలం అదృశ్యమయ్యాక
చూపులు శూన్యంలో దిగబడ్డాయి
దూరంగా ఎవరో తనకు కావలసిన
ఆరడుగుల నేల మోసుకెళ్తున్న
మసకబారిన దృశ్యం
అన్ని స్పందనలు కోల్పోయిన
గుండె యిప్పుడో సత్తు నాణెం!

– డాక్టర్ పెరుగు రామకష్ణ
98492 30443

చింతన

అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది
ఆకాశం డాబా మీద కూర్చుని జనాన్ని చూస్తుంటే
ఏం కథలు ఏం వెతలు
ఎంత మనుషులు ఏమేమి మనుషులు
ఎన్ని హంగులు ఎన్ని రంగులు
మరిన్నెన్ని నాటకాలు
ఇంత పెద్ద రంగస్థలం మీద
బహు స్వల్పమైన జీవితాన్ని
ఎంత బాగా అభినయిస్తున్నారు!
కొందరు ఎంత అందంగా పండిస్తున్నారు
పాల వెన్నెలలో పచ్చని పైరులా
పసిడి గుమ్మాల పచ్చ పచ్చని పందిరిలా
బతుకు ఓ పరసలా ఓ పండగలా
మరి కొందరేమో బాధలకు బందీలు
రోగాలు రొప్పులు కుదిరి
ముసురు గప్పిన దిగులులా
మూలబడిన వస్తువుల్లా
దివారాత్రుళ్ళు
లేని దాన్ని వెతికి వెతికి
లేనిపోని వాంఛలతో
పనికి రాని కాంక్షలతో పదే పదే
అదే స్వార్థంతో అదే అదే సంకుచితంతో
ఉన్నదాన్ని విడిచి
లేని దాన్ని పట్టుకు వేలాడుతూ
వేసారి పోతూ
శ్మశానం మీదుగా సమాధుల గుండా
కాకపోతే మరి ఎక్కడికి పోతారు?
స్వర్గ నరకాలన్నీ ఇక్కడే వదిలి...
నేను మాత్రం
నా ఆకాశంలో నా డాబా మీద
ఓ చింతనాత్మక గేయమై ...

– లోసారి సుధాకర్

మహాధర్నాకు సంఘీభావంగా

కార్మిక – కర్షక జనకవనం

బిజెపి పాలిత కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలనన్నిటినీ రద్దు చేసి వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చింది. ఈ చట్టాలు కార్మికుల కనీస వేతన హక్కును హరించడమే కాకుండా, ఉద్యోగాలన్నిటినీ కాంట్రాక్టు పద్ధతికి మార్చేసి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తాయి. అలాగే ఢిల్లీలో రైతులు చారిత్రాత్మకంగా నిర్వహించిన పోరాటం ఫలించి రైతు వ్యతిరేక చట్టాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినా, ఆ సందర్భంలో ప్రధానమంత్రి హామీ ఇచ్చిన పంటలకు కనీస మద్దతు ధర హామీ ఇంతవరకు అమలు కాలేదు. ఒకవైపు రైతులకు, కార్మికులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడుతూ, దేశ, విదేశీ కార్పొరేట్లకు మాత్రం కోట్లాది రూపాయలను దోచిపెట్టే విధానాలను రూపొందించి అమలు చేస్తుంది. మరోపక్క కులం, మతం, భాష పేరుతో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బ తీస్తోంది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజంపై దాడులు చేస్తుంది. రాజ్యాంగం మౌలిక స్వభావాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతోంది. కేంద్ర ప్రభుత్వ వైఖరితో దేశంలోని కర్షకులు, కార్మికులు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఆగస్టు 24న ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య, సంయుక్త కిసాన్ మోర్చాల జాతీయ ఐక్యవేదిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో నవంబరు 26 నుంచి 28 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించాయి. ఈ మహాధర్నాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలియజేయాలని దేశప్రధానికి డిమాండ్ల చార్టర్‌ను పంపాలని పిలుపునిచ్చాయి. ఆ పిలుపునందుకొని మన రాష్ట్రంలో నవంబర్ 27, 28 తేదీల్లో కార్మిక, రైతుసంఘాల జాతీయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో వేలాదిమందితో ఈ మహాధర్నా జరిగింది. ఈ మహాధర్నాకు సంఘీభావంగా కవులు, రచయితలు 'కార్మిక-కర్షక జనకవనం' నిర్వహించి తమ గొంతు కలిపారు. నవంబర్ 27 సాయంత్రం 6 గంటలకు 'మహాధర్నా'లో పాల్గొన్న వేలాది రైతు, కార్మిక సోదరుల సమక్షంలో తమ స్వీయ కవితల ద్వారా ప్రజా రచయితలుగా తమ మద్దతు తెలిపారు.

ప్రముఖ కవి కొండపల్లి మాధవరావు చదివిన పద్యంతో జనకవనం ప్రారంభమైంది. కార్మికుల, కర్షకుల పోరాటాలను కొనియాడుతూ 'సూర్యచంద్రులు లేనిదే/ మనం ఉండగలమా?/ కార్మికులు, కర్షకులు/ లేనిదే ఈ ప్రపంచం లేదు...' అంటూ నాలుగవ తరగతి చదువుతున్న చంద్రహాస్ 'కష్టపడేవాళ్ళ కోసం' అనే కవిత చదవడం విశేషం. ఢిల్లీలో జరిగిన రైతుపోరాటాన్ని గుర్తుచేస్తూ 'ఈ భూమినే వంచినవారు – ఈ ప్రభుత్వాలను వంచలేరా?' (హెచ్చరిక) అనే కవితా చరణంతో కవి గోళ్ళ నారాయణరావు ఆకట్టుకున్నారు.

'మట్టి మనుషుల మహా పోరాటం/ ఇది కష్టజీవుల చారిత్రక ప్రయాణం/ కార్మిక కర్షక స్వేదజలమే సమాజానికి ఇంధనం/ దేశ రక్షణకు పూరించిన రణన్నినాదం/ మరో ప్రపంచం కోసం కదులుదాం/ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై కలిసి పోరాడదాం' అంటూ కె. ఎక్స్. రాజు తన స్వీయ కవితను ఉత్తేజకరంగా చదివారు.

"కార్మికులు కర్షకులు/ దేశానికి రెండు కళ్ళైతే/ కనుగుడ్లు బయటకొచ్చి/ నెత్తురోడుతున్న భరతమాత' అంటూ కవి సరికొండ నరసింహరాజు చదివిన కవితకు మంచి స్పందన వచ్చింది.

'పొద్దుట నుంచి రాత్రి వరకు/ నేలలో పాతిన స్తంభాల్లా/ కట్టుకొయ్యల్లా గంటల యుగాలు/ పాతుకుపోవడం ఎంత నరకం' అంటూ కవయిత్రి మందరపు హైమవతి మాల్స్‌లో, బట్టల షాపుల్లో, ఫ్యాన్సీ షాపుల్లో నిలబడి పనిచేసే అసంఘటిత రంగ మహిళా ఉద్యోగుల కష్టాలను దృశ్యీకరించారు.

'తెల్లారి లేస్తే చాలు/ నేల రాలుతున్న పసుపు/ కాషాయం, నీలం, పచ్చ/ పూలు చూడడానికి/ బాగున్నాయేమో../ కానీ అన్నిటి మధ్యలో/ మెరిసిపోతున్న ఎర్రపూలకే/ నా చూపులు/ ఓటేస్తున్నాయి' అంటూ కవయిత్రి అమూల్య చందు ఎర్రజెండా చేతబట్టి ధర్నాలో పాల్గొన్న వేలాది కర్షక, కార్మికులను 'ఎర్రపూలు'గా సంబోధిస్తూ కవితను చదివారు.

'తోటమాలి ఎవరో ఆకాశానికి/ నారింజ పళ్ళు కాపిస్తున్నాడు!/ చిత్రకారుడు ఎవరో భూమికి/ కాషాయ రంగేస్తున్నాడు/ ఒకానొక ఊడలమర్రి జడల దయ్యం/ దేశాన్ని వెనక్కి నడిపిస్తుంది ముందుగా/ ఈ రాజ్యం దారిద్ర్యాన్ని పండిస్తుంది' అంటూ కవి శిఖా-ఆకాష్ దేశంలోని మతోన్మాద రాజకీయాల పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

'చీమల పుట్టలో పాములు చేరినట్టు/ ప్రపంచపటమంతా/ శ్రమ దోపిడీ/ నెత్తులకు కట్టిన బండరాళ్లను/ లాక్కెళ్ళుతూ/ పజలు/ నా దేశంలో కూడా ఇదే దృశ్యం/ పున్ఃపున్ః పునరావతం" అంటూ ప్రపంచవ్యాప్తంగానూ, మన దేశంలోనూ జరుగుతున్న శ్రమదోపిడీని శక్తివంతమైన కవితాచరణాలతో వైష్ణవిశ్రీ కవిత్వీకరించారు.

'విధ్వంసమే అభివద్ధికి అసలు అర్థమనడం/ పోరు అనివార్యత చాటడమే/ కార్మిక, కర్షక నిరసన స్వరం/ దేశమంతా పిక్కటిల్లుతోంది..' అంటూ కవయిత్రి శాంతిశ్రీ కర్షక, కార్మిక చైతన్యాన్ని తన కవితలో వ్యక్తం చేశారు.

'నెత్తిమీద టన్నుల బరువులు మోసిన/ నేను/ పన్నులు మోయలేకపోతున్నాను/ నా చెమట చుక్కల దోపిడి/ మినరల్ వాటర్ ప్లాంటై కోనుగోలు చేయాల్సివస్తుంది' అంటూ తాగేనీళ్ళను కూడా వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ సంస్కృతిని తీవ్రంగా తన కవితలో ఎండగట్టారు తంగిరాల సోని.

'కార్మికా ఓ కర్షకా/ నీది నాది ఒకటే కోరికా/ ఈ దోపిడీ రాజ్యాన్ని కూల్చాలిక/ వేరే ఏ దారీ లేదిక/ పోరాటం ఒక్కటే దారిక/ ముసుగులో గుద్దులాట వద్దిక/ ముందు నిలిచి పోరాటం చేద్దామిక!' అనే గేయాన్ని పాడి కవి గడ్డం విజయరావు సభను ఆకట్టుకున్నారు.

'మృత శరీరాల మధ్య/ ఆరేళ్ళ బాలుడు/ దేనినో వెతుకుతున్న దృశ్యం/ ఆ బాలుడు కళ్ళ నిండా/ తల్లి జ్ఞాపకాల/ దొంతర' అంటూ కవి అరసవిల్లి కృష్ణ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గ యుద్ధంలో పసిపిల్లల తల్లుల మరణాల దృశ్యాన్ని హృద్యంగా కవిత్వీకరించారు. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా మన దేశ వారసత్వంగా వస్తున్న విదేశాంగ విధానానికి విరుద్ధంగా మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్ వైపు నిలబడడం ప్రజావ్యతిరేక విధానాలకు పరాకాష్ట.

'యుఎన్వోకే ఎసరు పెట్టిన/ అమెరిక వాని సాకులు నీతులు/ ఆఫ్ఘను రాజ్యము నాక్రమించెరా! ఇరాకుపైనా/ యిరుచుకుపడెరా! పాలస్తీనా, ఇరాను, సిరియాపై/ ఇసపు చూపులతో యికిలిస్తోందిర!/ యుద్ధం యుద్ధం యుద్ధం చెయ్యర / ఇనుప డేగ పెడరెక్కలు నరకగ/ చెయ్యర చెయ్యరు చెయ్యర... యుద్ధం/ అమెరికవాడి పీచమణచగా/ యుద్ధం యుద్ధం/ యుద్ధం... చెయ్యర' అంటూ కవి దివికుమార్ అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని, యుద్ధోన్మాదాన్ని నిరసిస్తూ తను గతంలో రాసిన కవితను చదివి వినిపించారు.

'దేశ స్వావలంబనను తుంచి/ దేశ సంపదను నీ కార్పొరేట్ చుట్టాలకు కట్టబెట్టిన పాలన/ ఇది దుష్ట చతుష్టయ పాలన/ దీనికి వంత పాడిన వారి/ అధికార పీఠాలు కూలుతాయంటూ హెచ్చరిస్తుంది ఈ మహా ధర్నా' అంటూ మహాధర్నా స్ఫూర్తితో కవి ఎస్.వెంకట సుబ్బయ్య తన కవితను చదివారు.

'మతోన్మాద, కులోన్మాద ఫ్యూడలిజం/ కాయతొలుచు పురుగులను వదులుతుంది/ తననేమీ చెయ్యవులే నన్నధీమాతో/ చిగురాకు కొమ్మలపైకి/ సుతిమెత్తని పువ్వులపైకి, విరబూసిన కాయల పైకి.../ భారత రాజ్యాంగం చెట్టు నీడలోని లౌకికవాద కవి కోకిల లారా..." అంటూ కవి బి.వి. శ్రీనివాస్ ప్రజా కవులను 'తస్మాత్ జాగ్రత్త' అని హెచ్చరిస్తున్న కవితను చదివారు.

'అనాదిగా భూమికి ఊపిరై/ శ్రమగానం చేసినావు/ భూమిలేక నీవులేవు నీవులేక పంటలేదు/ నమ్మిన భూమి నేడు/ మాయమౌతున్నదా/ సెజ్‌లంటూ థర్మల్ ప్లాంట్‌లంటూ/ వాన్‌పిక్‌లంటూ కోస్టల్ థర్మల్ కారిడార్‌లంటూ/ పంటభూముల్లో పొగగొట్టాలు పొడుచుకొస్తున్నవి/ లాఠీలు తూటాలు రైతు దేహాన నెత్తుటి గాయాలవుతున్నాయ్' అంటూ మట్టిమనిషి రైతు జీవిత వ్యథను దృశ్యీకరించి ఆకట్టుకున్నారు కవి చలసాని వెంకట రామారావు.

ఇంకా ఈ జనకవనంలో కలిమిశ్రీ, రెడ్డి శ్రీనివాసరావు, దేవరపల్లి రమణరావు, జగదీశ్వర్, సురేష్‌కుమార్ తదితర కవులు తమ కవితలు చదివారు. వైవిధ్యమైన కవితా పఠనంతో జనకవనం ఆద్యంతం ఆలోచనాత్మకంగా, ఉత్తేజంగా సాగింది. ప్రజా సమస్యల పట్ల సామాజిక దృక్పథంతో వైవిధ్యభరితమైన కవిత్వంతో కవులు అలరించారు. కార్మికులూ, కర్షకులూ సమిష్టిగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఎంతో ఉందని, ఈ మహాధర్నాలో పాల్గొన్నవారికీ అభినందనలు అంటూ కథారచయిత్రి ఉషారాణి సంఘీభావాన్ని తెలిపారు. ఈ జనకవనంలో పాల్గొని కార్మికులకూ, కర్షకులకూ సంఘీభావాన్ని తెలపడానికి ముందుకొచ్చిన కవులు అభినందనీయులు. ప్రజాస్వామిక పోరాటాలను, కర్షక, కార్మిక ఆందోళనలను అణిచివేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కవులు, రచయితలు కూడా నిర్బంధాల పాలవుతున్నారు. ఈ నిర్బంధాలకు, అణిచివేతలకు భయపడకుండా ప్రజాస్వామ్యాన్ని, మనదేశ రాజ్యాంగ విలువల్ని రక్షించుకోవడానికి ప్రజా రచయితలు ముందుకు రావాల్సిన అవసరం నేడు ఎంతో ఉంది. ఈ జనకవనంలో పాల్గొని తమ వంతు పాత్రని నిర్వహించిన కవులందరికీ ధన్యవాదాలు. వొరప్రసాద్ జనకవనాన్ని నిర్వహించగా, శాంతిశ్రీ వందన సమర్పణతో ముగిసింది. ఈ కార్యక్రమంలో కవి, రచయిత డా॥ రావెళ్ళ శ్రీనివాసరావు, సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, దాసరి సుబ్రహ్మణ్యం, షార్ట్ ఫిలింస్ అసోసియేషన్ బాధ్యులు రాజు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

– వొరప్రసాద్

మానవ వైరుధ్యాల సమ్మేళనం ఈ నవల

ప్రతి మనిషి జీవితం ఒక కథే. ఆ కథలో, జీవితంలో సంఘర్షణ ప్రతి అడుగులోను ఉంటుంది. ఒక నిర్ణయం ధైర్యంగా తీసుకోవాల్సిన సమయం వచ్చేవరకు సంఘర్షణే. నిర్ణయం తీసుకున్నాకనే ఆ సంఘర్షణ ఆగుతుంది. సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాల్లా పరుగెత్తితేనే ప్రగతి. అలాగే ఒక మనిషి సమాజాన్ని, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయించుకుంటూ సాగితేనే అది సంతృప్తికరమైన జీవితం. మనిషి తన వ్యక్తిగత సంతోషాన్ని, ఆనందకరమైన జీవితాన్ని పొందటంలో కొంత బెరుకు, తాత్సారం చేస్తూ చివరకు ధైర్యంగా తన జీవితాన్ని మలచుకోవటమే ఈ 'జీవన స్పర్శ' నవల.



నవల చదువుతున్నపుడు నాకు 70, 80లలోని జీవన స్థితిగతులు అన్నీ కళ్ళముందు కదలాడాయి. నడిచే రోడ్డు మీద రేగే ధూళి దగ్గర నుండి గోళీసోడా వరకు అన్నీ చాలా సహజమైన సౌందర్యంతో, హృదయాన్ని తట్టాయి. ఎక్కడా మితిమీరిన హీరోయిజం చూపకుండా అతి సాధారణ జీవన పరిస్థితులు, సంఘర్షణల నడుమ ఒక కథానాయకుడిని సృష్టించారు రచయిత గనారా

ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి మధు. ఒక్కగానొక్క కొడుకు. తండ్రి అంటే భయమూ-భక్తి, తల్లి అంటే ప్రేమ-స్నేహం ఉన్నవాడు. అతనిది ఒక చిన్న ప్రపంచం. అమ్మ, నాన్న, ముగ్గురు స్నేహితులు. రాధ అంటే ఎంతో ప్రేమ కాని ఎప్పుడూ బయటకు చెప్పడు. కాని తల్లికి అతని మనసు తెలుస్తుంది. పురాణాలు, ఇతిహాసాలు, విని పెరిగిన మధు బంధువైన ఒక పెద్దాయన ప్రభావంతో ఏ విషయమైనా ప్రశ్నించడం ద్వారా, సమాధానాన్ని పొందడం సరైన మార్గాన్ని కలిగిస్తుంది అని తెలుసుకుంటాడు. హేతువాదాన్ని పెంపొందించుకొంటాడు. మూఢంగా విశ్వసించడం కంటే ప్రశ్నించుకుంటే సరైన దారిలోకి వెళ్ళగలం అని, అదే మానవ చైతన్యం అని, మధు పాత్ర ద్వారా మనకి కూడా తెలుస్తుంది. మధు బ్యాంకు ఉద్యోగి. అమాయకుడు, మంచివాడు, తెలివైనవాడు, ధైర్యం వున్నవాడు, భయస్తుడు. ఇన్ని ఎలా ఉంటాయి? అనుకోకండి. ఒక్కో చోట ఒక్కోటి బయట పడతాయి. ఒక్కోచోట తెగువ, ఒక్కోచోట తాత్సారం.

పోర్టు కార్మికుల బాధల గురించి తెలిసి, చలించి, ధైర్యంగా షిప్‌లోకి, ఎక్కి నడి సంద్రానికి పోరాట స్ఫూర్తితో చేరుకుంటాడు. అందులో ధైర్యం, తెగువ, సమాజం పట్ల ప్రేమ, కనబడతాయి. కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపడంలో అవగాహన, తెలివితేటలు కనబడతాయి. కాని, తన సొంత విషయాలు వచ్చేసరికి, తన ప్రేమను గురించి చెప్పుకోవడానికి, ఒప్పుకోవడానికి చాలా భయస్తుడుగా కనబడతాడు. తన కోసమే ఒక మనిషి, జీవితం అంతా ఎదురు చూస్తోంది అని తెలిసినా తెగువతో, చొరవతో నిర్ణయం తీసుకోలేడు. ఇలా పరస్పర వైరుధ్యాలు అతనిలో కనిపిస్తాయి.

రచయిత ఈ నవలలో మార్క్సిజం, కమ్యూనిజం గురించి చాలా విపులంగా చెప్పారు. ప్రతి వ్యక్తి పోరాట స్ఫూర్తి కలిగి వుండాలి అంటారు. ఉద్యోగం, ఇల్లు, భార్య, పిల్లలు, కుటుంబం మాత్రమే కాదు; మన చుట్టూ వున్న సమాజం కూడా మన జీవితంలో భాగమే. దానికి కూడా సమయాన్ని కేటాయించాలి అని మధు పాత్ర ద్వారా తెలియజేస్తారు. ఈ నవల ద్వారా ప్రతి మనిషికి తన కుటుంబంతోపాటు సమాజంపట్ల కూడా బాధ్యత, ప్రేమ కలిగి వుండాలని అనిపిస్తుంది. మధు సామాజిక సమస్యల పట్ల బాధ్యత తీసుకుంటాడు, వివిధ రంగాల్లోని కార్మికుల సమస్యల పట్ల, బాధల పట్ల ఎంతగానో చలించిపోతాడు. ఆ సమస్యలపై పోరాటానికి ధైర్యం, తెగువ చూపిస్తాడు. ప్రతి మనిషి సమాజం పట్ల కొద్దిగానైనా ఇలా ఆలోచిస్తే అందరం బాగుంటాం.

హరికథలు, బుర్రకథలు వంటి కళారూపాలు ఆహ్లాదాన్ని మాత్రమే కాదు; మనిషికి ఆలోచనా శక్తిని, పోరాటస్ఫూర్తిని కలిగించాలని, సమాజంలో జరిగే అన్యాయాలను, పీడితుల పట్ల జరిపే దారుణాలను, ప్రతిబింబిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడానికి సాధనాలుగా ఉపయోగపడాలని ఈ నవల ద్వారా తెలియజేస్తారు గనారా. ప్రతి వృత్తికి ఒక సంఘం ఉండాలి. అందులోని నాయకత్వం క్రియాశీలకంగా బాధ్యతతో వ్యవహరించుకొంటూ వెళితే ప్రతి సమస్యకి పరిష్కారం దొరుకుతుంది. అలాగే నాణానికి రెండు వైపులా వున్నట్టు, ఈ సంఘాల్లో కూడా స్వార్ధపరులు వుంటారని చెప్పారు రచయిత.

ఈ నవలలో శ్రీశ్రీ మహాప్రస్థానంలోని విప్లవం, చలం నవలలోని తెగువ-ధైర్యం, కృష్ణశాస్త్రి బాధ, అన్నీ ఇమిడి వున్నాయి. మనుషులందరూ ఒకటే అయినపుడు ఈ కులాలు ఎక్కడ నుంచి వచ్చాయి అని రచయిత ప్రశ్న. కులం, మతం అనేవాటిని ఆరోప్రాణంగా బతుకున్న మనుషుల్ని ఆలోచింపచేస్తుంది ఈ నవల. కులం కూడు పెట్టదు. మతం నీడని ఇవ్వలేదు. అందరూ కలిస్తేనే సమాజం. మనిషిని ఆదరించాలి అన్నా, సహాయం చేయాలి అన్నా, మానవత్వం, ప్రేమ, స్నేహబంధం ఉండాలి అని తెలుస్తుంది ఈ 'జీవన స్పర్శ' నవల ద్వారా.

"ఏటిలోని కెరటాలు ఏరు విడిచి పోవు. ఎదలోని మమకారం ఎక్కడికీ పోదు". ఎన్నాళ్ళు గడిచినా రక్త సంబంధంలోని ప్రేమ, పాశం మనిషిని వీడిపోవు అని చెప్పడానికి ఈ పల్లవిని ఉపయోగించారు రచయిత. అలాగే అసమానతలతో వున్న ఈ సమాజం మారాలి అన్న రచయిత తీవ్రమైన ఆకాంక్ష మనకి తెలుస్తుంది. రచయిత హృదయం, ఆలోచనలు అన్నీ ఎంత నిర్మలమైనవో కూడా తెలుస్తాయి. గనారా మనసు ఏంటో మనకు అర్థం అవుతుంది.

బెంగాల్ కరువు, ఆకలితో ప్రజలు అల్లాడి మరణించడం, కరువుతో రైతులు వలస వెళ్ళడం, ధనవంతులు కార్లలో తిరగడం, ఉద్యోగాల గూర్చి ఎగబడటం, గుమ్మం దాటని స్త్రీలు బయట కూలిపనికి, పిడికెడు మెతుకుల కోసం వ్యభిచారం చేయడం ... ఇలా ఆనాటి అన్ని సమస్యలకి మధు చలించడం పాఠకుని మనసుని కలిచివేస్తుంది. ఇందులో చెప్పిన ప్రతి సమస్యా ఏవో ఒకటి, రెండు తప్ప మిగతా అన్నీ ఇప్పటికీ అలానే ఉన్నాయి, పరిష్కారానికి నోచుకోలేదు. అందరిలో చైతన్యం వస్తేనే వీటన్నిటిని అధిగమించగలం. అందుకు విద్య చాలా అవసరం. అది కూడా స్పష్టంగా చెప్పారు. ప్రశ్నించే తత్వం ప్రతి మనిషికి అలవడాల్సిన మొదటి లక్షణం అని తెలియజేసారు. అదే కమ్యూనిస్టు పార్టీ ఈ దేశానికి నేర్పిన మొదటి పాఠం అని తెలుస్తుంది. ప్రశ్నించడం, అన్వేషించడం, నిర్దేశించడం అనే ఒరవడి ఏర్పడితేనే మనుషులు ప్రగతి వైపు పరుగులు తీస్తారు అన్న రచయిత ఆలోచన తెలుస్తుంది. ఈ మాటలు సమాజానికి, యువతకి ఒక మార్గ నిర్దేశం.

విప్లవం అంటే కేవలం తిరుగుబాటుతనం కాదు. సమాజం ఒక దశ నుంచి మరొక దశకు మౌలికంగా మారడం అని చెప్పారు. కాని అది శాంతియుతంగా అయితే జరగదు కదా! దానికోసం పోరాటాలు చేయాలి అని ఈ నవలలో రచయిత సమాజం పట్ల బాధ్యతని తెలియజేసారు. విప్లవం అనే పదాన్ని తేలికగా ప్రతిదానికి వాడుతున్నాం అని అందరికీ అనిపిస్తుంది. కాని అది ఎంత విస్తృతమైనదో ఇందులో చెప్పారు రచయిత.

ఆఖరుగా నాకు అనిపించింది ప్రతి మనిషీ తన కోసం, కుటుంబంకోసం, సమాజంకోసం తన జీవన పోరాటాన్ని కొనసాగించాలి. ఈ నవలలో అగ్రవర్ణాల ఛాదస్తాలు గురించి ప్రస్తావించారు. వాటితోపాటు అగ్రవర్ణాల బాధలు, బీదరికం, వారి కుటుంబాన్ని వాళ్ళే ఉద్ధరించుకోగలిగే మానసిక స్థైర్యం లేకపోవడం అన్నింటినీ తెలియజేసారు. చాలామంది రచయితలు బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని, అహంకారాన్ని తమ రచనలలో చొప్పించటం చూస్తాం. కాని దిగువ మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబాల దైన్యాన్ని చెప్పినవారు తక్కువ. వాటినన్నటిని రచయిత కళ్ళతో చూసి, మనసుతో అర్థం చేసుకొని మమేకమై ఈ నవల రాశారు.

చదువు ఏ వర్ణం వారికైనా కచ్చితంగా వుండాలి. ధైర్యం అందరికీ ఆయుధం కావాలి. ముఖ్యంగా స్త్రీకి చదువు, ధైర్యం వుండాలి. రాధ కుటుంబం బ్రాహ్మణ కుటుంబం. తండ్రి పోయాక ఆ కుటుంబం చాలా బాధలు అనుభవించింది. వాళ్ళ కులం, వారికి ఎప్పుడూ ఉపయోగపడలేదు. స్నేహితులే ఆదుకుంటారు. జీవితం చేయి దాటిపోతున్నపుడు ప్రాణం మీదకి వచ్చినపుడు ఎవ్వరూ కులం, మతం పట్టించుకోరు. ఇదే ఆలోచన ప్రతి విషయంలో ఎందుకు వుండదు మనిషికి? మనిషి తన అవసరానికి చాలా స్టేట్‌మెంట్స్, డెఫినిషన్స్ ఇస్తాడు. తన ప్రయారిటీస్‌ని మార్చుకుంటాడు. ఈ కుల మతాలు కూడా అంతే! అంతా వారి స్వార్థంకోసం వాడుకుంటారు. అడవి గుఱ్ఱంలా తిరిగే మనిషికి కళ్ళెం వేయగలిగేది సమ సమాజం, చైతన్యం, ప్రగతి అవ్వాలి తప్ప కులం, మతం, డబ్బు అవ్వకూడదు అంటారు రచయిత. మొత్తం మీద ఈ నవల అనేకానేక వాస్తవిక జీవిత సంఘర్షణలను చక్కగా చిత్రీకరించింది. రచయిత గనారా గారికి అభినందనలు.

– జోస్యుల దీక్ష
89855 70753

తెలుగు సాహితీవనం కథా పురస్కారం -2024

తెలుగు సాహితీవనం కథాపురస్కారం కోసం కథలను ఆహ్వానిస్తున్నాం. నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ. 2,116 చొప్పున నగదు బహుమతితో పురస్కార ప్రదానం ఉంటుంది. హైదరాబాద్‌లో జరిగే తెలుగు సాహితీవనం వార్షికోత్సవ సభలో విజేతలకు పురస్కారం అందచేస్తాము. వర్తమాన పరిస్థితులు, మానవ సంబంధాలు ... తదితర ఏ సాంఘిక ఇతివత్తంతోనైనా కథ రాయొచ్చు. కథ 1200 పదాల కంటే మించరాదు. కథను వర్డ్ లో యూనికోడ్‌లో టైప్ చేసి టెక్స్ట్ రూపంలో sahitivanam82@gmail.com కు పంపించాలి. కథతో పాటు హామీ పత్రం తప్పకుండా జత చెయ్యాలి. కథలను పంపటానికి చివరి తేదీ : 30.12.2023. మరిన్ని వివరాలకు –9490805404.

– తెలుగు సాహితీవనం టీమ్

డ్యూటీ పుస్తకావిష్కరణ సభ

విశాఖ పుస్తక మహోత్సవంలో భాగంగా టర్నల్ చౌల్ట్రీ ఆవరణలో, విశాఖరచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు 'డ్యూటీ' నవల ఆవష్కరణ సభ ఉంటుంది. ఆదిరెడ్డి మావుళ్ళు రచించిన ఈ నవలను ఆర్టీసీ అధికారి ఎ.అప్పల రాజు ఆవిష్కరిస్తారు. ఎస్.హనుమంతరావు పుస్తక సమీక్ష చేస్తారు. అడపా రామకృష్ణ, ఆచార్య వెలమల సిమ్మన్న, దామెర్ల సూర్యారావు, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొంటారు.

– విశాఖ రచయితల సంఘం

నవలల, నానీ సంపుటాల పురస్కార ఫలితాలు

జమున స్మారక జాతీయ స్థాయి నానీల సంపుటి అవార్డు, నవలా రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి నవలల పోటీ ఫలితాలు వెలువడ్డాయి. వి.ఆర్. రాసాని 'వొలికల బీడు' నవలకు ఉత్తమ నవల పురస్కారం లభించింది. న్యాయ నిర్ణేతలుగా ఆచార్య సుశీలమ్మ, గంటి భానుమతి వ్యవహరించారు. ఉత్తమ నానీల సంపుటిగా ఎన్.లహరి రాసిన 'నానీల తీరాన' ఎంపికైంది. డాక్టర్ బాపూజీ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. త్వరలో జరిగే సభలో నవలకు రూ.15 వేలు, నాని సంపుటికి రూ.10 వేలు నగదు పురస్కారం అందజేస్తారు.

విశాలాక్షి కథ, కవితల పోటీ

విశాలాక్షి సాహిత్య మాస పత్రిక ఆధ్వర్యాన శ్రీమతి తటపర్తి భారతి స్మారకంగా తెలుగు కథ, కవితలు, బాలల కథ పోటీ నిర్వహిస్తున్నారు. కథలలో 5 వేలు, 4 వేలు, 3 వేలు నగదు బహుమతులు ఉంటాయి . నాలుగో బహుమతి కింద 8 కథలకు, ఒక్కో కథకు 1000 రూ. నగదు బహుమతులు ఉంటాయి. బాలల కథలు, కవితలకు కూడా రూ.1000, 750, 500 ల చొప్పున వేర్వేరు గా బహుమతులు ఉంటాయి. డిసెంబర్ 31 లోపు విశాలాక్షి సాహిత్య మాస పత్రిక, 27/5/487 పద్మావతి నగర్ బాలాజీనగర్, నెల్లూరు 524004 కు పంపాలి.

– ఈతకోట సుబ్బరావు, 94405 29785

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

రాజస్థాన్‌లో 16 మంది మంత్రుల ఓటమి

జైపూర్: ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌తో సహ పోటీ చేసిన 25 మంది మంత్రుల్లో తొమ్మిది మంది గెలుపొందగా, 16 మంది ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ స్పీకర్, కాంగ్రెస్ నేత సిపి జోషి నాథద్వారా నియోజకవర్గంలో ఓడిపోయారు. పోటీ చేసిన ఏడుగురిలో ముగ్గురు బిజెపి ఎంపిలు ఓడిపోయారు. ప్రతిపక్షనేత, బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ పునియా అంబర్ నియోజకవర్గం నుంచి ఓటమి పాలయ్యారు.

మధ్యప్రదేశ్‌లో కేంద్ర మంత్రి ఓటమి

మధ్యప్రదేశ్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే ఓటమి పాలయ్యారు.కాంగ్రెస్, ప్రతిపక్ష నాయకుడు గోవింద్ సింగ్ లహర్ స్థానం నుంచి ఓడిపోయారు.

తాపీ అసెంబ్లీ స్థానాన్ని నిలబెట్టుకున్న ఎన్‌డిపిపి

కోహిమా : నాగాలాండ్‌లోని మోన్ జిల్లాలో తాపీ అసెంబ్లీ నియోజవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి) విజయం సాధించింది. సమీప కాంగ్రెస్ అభ్యర్థి వాంగ్లెమ్ కొన్యాక్‌పై ఎన్‌డిపిపి అభ్యర్థి వాంగ్‌పాంగ్ కొన్యాక్ 5,333 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి ఎన్‌డిపిపి అభ్యర్థి నోక్ వాంగ్నావో విజయం సాధించారు. ఆగస్టు 28న వాంగ్నోవో మరణించడంతో నవంబర్ 7న ఉప ఎన్నిక నిర్వహించారు. ఫలితాన్ని ఆదివారం ప్రకటించారు.

ఓట్లు రాల్చని మృదు హిందూత్వ

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఓటమికి ఓ ముఖ్య కారణం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి, ఆరెస్సెస్ అనుసరించే కరడుగట్టిన హిందూత్వను మృదు హిందూత్వతో ఎదుర్కోలేమని మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరోసారి స్పష్టం చేశాయి. మృదు హిందూత్వతో బిజెపిని ఎదుర్కోగలమన్న కాంగ్రెస్‌కు భంగపాటు తప్పలేదు. ఈ మూడు హిందీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు ప్రజా సమస్యలను విడిచిపెట్టి మృదు హిందూత్వను ఆశ్రయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం నుంచి కూడా వీరికి ఆ విధమైన ప్రోత్సాహం లభించింది.

మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ తరచూ తన మృదువైన హిందూత్వాన్ని విడిచిపెట్టి, రాడికల్ హిందూయిజం న్యాయవాదిగా ఓటు వేయడానికి వచ్చారు. స్వయం ప్రకటిత దైవసంభూతుడు బాగేశ్వర్ బాబా తన సొంత నియోజకవర్గం చింద్వాడలో జరిగిన సంఘటన ఒబిసి వర్గాన్ని పెద్దగా కలవరపరిచింది. హిందూ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని, సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారి ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయాలని ప్రకటించిన వివాదాస్పద వ్యక్తి బాగేశ్వర్ బాబా. బాగేశ్వర్ బాబాతో కలిసి బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొని ఒబిసి వర్గానికి విరోధాన్ని సంపాదించుకోవద్దని స్థానిక కాంగ్రెస్ నేతలు చేసిన హెచ్చరికలను కమల్‌నాథ్ పట్టించుకోలేదు.

అయోధ్యలోని రామ మందిర భూమి పూజ కార్యక్రమానికి కమల్‌నాథ్ 11 వెండి ఇటుకలను పంపడం కూడా చర్చనీయాంశమైంది. . భూమి పూజ రోజున కమల్‌నాథ్ తన నివాసంలో 'శ్రీరామ్ దర్బార్' నిర్వహించి, జై శ్రీరామ్ అంటూ పెద్దయెత్తున నినాదాలిచ్చారు.. అయోధ్యలోని రామ మందిర ఘనతను ఎవరూ హైజాక్ చేయవద్దని, 1985లో రామమందిరాన్ని పూజల కోసం తెరిచింది రాజీవ్ గాంధీయేనని కమల్‌నాథ్ పేర్కొన్నారు. దేశంలో 82 శాతం మంది హిందువులు నివసిస్తున్నారని, దాని గురించి వాదించాల్సిన అవసరం లేదని కమల్‌నాథ్ స్పందించారు. సనాతన ధర్మానికి ఆయన చేసిన కృషిని ఎవరూ ప్రశ్నించలేరని కూడా కమల్‌నాథ్ పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద హనుమాన్ విగ్రహం తన నియోజకవర్గంలో ఉండడమే ఇందుకు నిదర్శనమని కమల్‌నాథ్ సూచించారు.

ఛత్తీస్‌గఢ్‌లో భూపేష్ బాఘెల్ బిజెపికి మించిన హిందూత్వ వాదినని చాటుకునే ప్రయత్నం చేశారు. రాముడి తల్లి కౌసల్యా దేవి పేరుతో ఉన్న ఆలయాన్ని పునరుద్ధరించడం, రామవనానికి వెళ్లే అటవీ మార్గాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం, గోవుల రక్షణకు గోదాన్ న్యాయ యోజన వంటి పథకాలను ప్రకటించి ఓట్లు రాబట్టువచ్చని లెక్కలు వేశారు. అవన్నీ దూది పింజల్లా తేలిపోయాయి.

రాజస్థాన్‌లో సాధ్వి ఆనందీసరస్వతి వంటి బిజెపి నేతలు ఎన్నికలకు నెలల ముందు కాంగ్రెస్‌లో చేరారు. గోసంరక్షణకు రూ.3,000 కోట్ల పథకాలు ప్రకటించారు. మేనిఫెస్టోలో పేడ సేకరిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ పునరుద్ధరణకు నిధులు, అర్చకుల ప్రోత్సాహకాలను పెంచారు.ఇలాంటి ప్రకటనలు, మెజారిటీని సంతృప్తి పరచడానికి చేసిన వాగ్దానాలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదని ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి.

ఎన్నికల అవగాహన లేక రాజస్థాన్‌లో చేజారిన ఫలితం

రాష్ట్రంలో ప్రభావం చూపుతున్న పలు పార్టీలతో అవగాహన కుదుర్చుకుని పోటీ చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించలేదు. దీని ఫలితంగా ఆ పార్టీ చాలా స్థానాల్లో ఓటమి పాలైంది. యుపికి అనుబంధంగా ఉన్న భరత్‌పూర్ బెల్ట్‌లో ప్రభావం చూపుతున్న సిపిఎం, హనుమాన్ బేనివాల్ రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ, ఆర్‌ఎల్‌డి వంటి పార్టీలతో అవగాహన కుదుర్చుకునేందుకు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. ఈ పార్టీలతకు రాజస్థాన్‌లో దాదాపు పది శాతం ఓట్లు ఉన్నాయి. ఇండియా వేదిక స్ఫూర్తితో కాంగ్రెస్ ఇతర పార్టీలతో అవగాహన కుదుర్చుకోవడానికి ప్రయత్నించి ఉంటే, బహుశా రాజస్థాన్ చిత్రం మరోలా ఉండేది.

భద్రలో లక్ష, మరో మూడు స్థానాల్లో 50వేలకు పైగా ఓట్లు

రాజస్థాన్‌లో సిపిఎం సాధించిన ఓట్ల వివరాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్‌లో బిజెపి గాలిని తట్టుకుని భద్ర నియోజకవర్గంలో లక్ష ఓట్లు, మరో మూడు నియోజకవర్గాల్లో 50 వేలకు పైగా ఓట్లు సిపిఐ(ఎం) అభ్యర్థులు సాధించారు. గతంలో ఉన్న రెండు స్థానాలను నిలబెట్టుకునేందుకు గట్టిగా పోరాడినప్పటికీ ఫలితం లేకపోయింది. మొత్తం 17 స్థానాల్లో సిపిఎం పోటీ చేసి చేయగా రెండు నియోజకవర్గాల్లో రెండో స్థానంలో ఉండగా, అందులో ఒక స్థానంలో స్వల్ప ఓట్ల (1,132) తేడాతో సిపిఐ(ఎం) అభ్యర్థి ఓడిపోయారు. గత ఎన్నికల్లో భద్ర, దంగర్‌గఢ్ స్థానాల్లో గెలుపొందింది. ఈ సారి ఆ రెండు స్థానాల్లోనూ బిజెపి గెలిచింది. భద్ర నియోజకవర్గం నుంచి బల్వాన్ పునియా 1,01616 ఓట్లు సాధించారు. రెండో స్థానంలో నిలిచిన ఆయన కేవలం 1,132 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. గత ఎన్నికల్లో 81,655 ఓట్లు లభించగా, ఈ ఎన్నికల్లో లక్ష వరకూ సాధించినా, స్వల్ప తేడాతో ఫలితం తారుమారైంది. కాంగ్రెస్ అభ్యర్థి 3,771 ఓట్లతో ఐదో స్థానానికే పరిమితమయ్యారు. ఈ ఓట్లు ఫలితాన్ని మార్పు చేశాయి. గత ఎన్నికల్లో ఈ స్థానంలో కాంగ్రెస్‌కు 37,574 ఓట్లు రాగా, ఈ ఎన్నికల్లో అవి బిజెపి వైపు మళ్లినట్లు విమర్శలున్నాయి. థాడ్ నియోజకవర్గం నుంచి పేమారామ్ 72,165 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. శ్యోపత్ రామ్ (రైసింగ్‌నగర్) 61,057 ఓట్లు, గిరిధరీలాల్ (దుంగార్గ్) 55,981 ఓట్లతో మూడో స్థానాల్లో నిలిచారు.

సిపిఎం అభ్యర్థులు సాధించిన ఓట్లు

బల్వాన్ పునియా (భద్ర) 1,01616 ఓట్లు, పేమారామ్ (థాడ్) 72,165 ఓట్లు, శ్యోపత్ రామ్ (రైసింగ్‌నగర్) 61,057 ఓట్లు, గిరిధరీలాల్ (దుంగార్గ్) 55,981 ఓట్లు, మంగేజ్ చౌదరి (నోహర్) 24,601 ఓట్లు, అమ్రారామ్ (దంతరామ్ ఘడ్) 20,891 ఓట్లు, నిర్మల్ కుమార్ (తారానగర్) 6,755 ఓట్లు, శోభాసింగ్ (అనుప్ ఘడ్) 8,886 ఓట్లు, సునీల్ కుమార్ (సదుల్పూర్) 5,657 ఓట్లు, భగీరథ మాల్ (లడ్నున్) 5,512 ఓట్లు, ప్రేమ్‌చంద్ పర్గీ (ఝూడోల్) 4,517 ఓట్లు, రఘువీర్ సింగ్ (హనుమన్‌ఘడ్) 2,828 ఓట్లు, గోటమ్‌లాల్ (దుంగార్‌పూర్) 2,318 ఓట్లు, ఛగన్‌లాల్ చౌదరి (సర్దార్‌షహర్) 1,942 ఓట్లు, ఉస్మాన్ గనీ (సికర్) 1,760 ఓట్లు, వీజేంద్ర థాకా (లచ్మాన్‌గఢ్) 1,202 ఓట్లు, కనరం (నవన్) 1,095 ఓట్లు

ఛత్తీస్‌గఢ్‌లో...

ఛత్తీస్‌గఢ్‌లో మూడు స్థానాల్లో సిపిఎం పోటీ చేసింది. కట్ఘోరా నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జవహర్ సింగ్ కన్వర్‌కు 2,535 ఓట్లు వచ్చాయి. భట్గావ్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి కపిల్ దేవ్ పైక్రాకు 2,018 ఓట్లు వచ్చాయి. లుండ్రా నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి బల్బీర్ నగేష్‌కు 2,041 ఓట్లు వచ్చాయి.

తెలంగాణ ఎన్నికల్లో సిపిఎంకు వచ్చిన ఓట్ల వివరాలు

1. పాలేరు	5308	11.ఇల్లెందు	2137
2. భద్రాచలం	5860	12.భువనగిరి	1315
3. అశ్వారావుపేట	2488	13.హుజూర్‌నగర్	1914
4. మధిర	6575	14.జనగామ	1765
5. ముషిరాబాద్	835	15.ఇబ్రహీంపట్నం	3948
6. మిర్యాలగూడ	3234	16.పటాన్‌చెరు	1158
7. నకిరేకల్	3238	17.మునుగోడు	2351
8. నల్గొండ	1439	18.కోదాడ	1195
9. సత్తుపల్లి	1210	19.ఖమ్మం	1940
10.వైరా	4439		

కాంగ్రెస్ ఓటమికి కారణాలనేకం

- రాజస్థాన్‌లో ముఠా తగాదాలు
- నాయకత్వ ఒంటెత్తు పోకడలు
- ఆనవాయితీగా వస్తున్న ప్రభుత్వ మార్పు

జైపూర్: కర్ణుడి చావుకు కారణాలనేకం అన్నట్లుగా, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఓటమికి అనేక కారణాలున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 200 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్నికలు జరిగిన 199 సీట్లలో 115 సీట్లను బిజెపి చేజిక్కించుకోగా, కాంగ్రెస్..71, ఇతరులు 21 .స్థానాలను దక్కించుకున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపిల మధ్య ఓట్ల తేడా కొద్ది శాతమే అయినా ... బిజెపి కంటే....కాంగ్రెస్‌కు 27 సీట్లు అధికంగా వచ్చాయి. రాజస్థాన్ పిసిసి చీఫ్‌గా నాడు యువనేత సచినప్ పైలట్‌కు ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగిస్తారని భావించిన కొన్ని సామాజిక తరగతులు ప్రధానంగా గుజ్జర్లు, మీనా, జాట్‌లు,.ఎస్‌సిలు. గెహ్లాట్ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. దీనినే తెలివిగా ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రచారంలో కెలికారు. గుజ్జర్లకు చెందిన పార్టీ యువ నేతను అవమానించారని ఆయన ప్రచారం చేశారు. కాంగ్రెస్‌కు గుజ్జర్లను దూరం చేసేందుకు ఆయన వేసిన ఈ ఎత్తుగడను ఆలస్యంగా గమనించిన కాంగ్రెస్ నాయకత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సచిన్ పైలట్, అశోక్ గెహ్లాట్ చేయి చేయి కలిపి ఒకే వేదికపై నుంచి కనిపించడం ద్వారా తమ మధ్య విభేదాలు లేవని చాటే ప్రయత్నం చేశారు.. పార్టీలో రోడ్డుకెక్కిన ముఠా తగాదాలు, దీనికి తోడు ఆ పార్టీ ఒంటెత్తు పోకడలు పోయింది. ఎన్నికల్లో ఇండియా ఫోరంలోని భాగస్వామ్య పార్టీలను కలుపుకునిపోవడానికి నికాకరించింది. ఇవన్నీ బిజెపి ఓటమికి దారి తీశాయాని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఒక సారి గద్దెనెక్కినవారికి ఒండోసారి నో ఛాన్స్

రాజస్థాన్‌లో 1990 నుంచి ఐదేళ్లకొకసారి ప్రభుత్వాన్ని మార్చడం సాంప్రదాయం. అదే ఈసారి కూడా పునరావృతమైంది. బిజెపి గెలుపొందింది. రాజస్థాన్‌లో అశోక్ గహ్లాట్ ప్రభుత్వం పేపర్ లీకేజ్ ఆరోపణలను ఎదుర్కొంది. అలాగే నిరుద్యోగం వంటివి చవి చూసింది. దీంతో ఆపార్టీ ప్రజలు ఓడించారు. ప్రతిపక్ష బిజెపిని గెలిపించారు. అయితే ఇక్కడ గణనీయమైన ఓట్లు సాధించిన సిపిఎంతో కాంగ్రెస్ పార్టీకి పొత్తు చర్చలు విఫలం కావడం కూడా ఆ పార్టీకి నష్టం చేకూర్చింది. మొత్తం 200 స్థానాలుండగా, ఒక కాంగ్రెస్ అభ్యర్థి మరణించడంతో 199 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అందులో బిజెపి 115 (41.69 శాతం), కాంగ్రెస్ 68 (39.59 శాతం), భారత్ ఆదివాసీ పార్టీ (బిఎపి) 3, బిఎస్‌పి 2 (1.82 శాతం), ఆర్‌ఎల్‌డి1, ఆర్‌ఎల్‌టిపి 1 (2.39 శాతం), స్వతంత్రులు 8 స్థానాల్లో గెలిచారు. 2018 ఎన్నికలతో పోల్చితే బిజెపికి 42 స్థానాలు పెరగగా, కాంగ్రెస్‌కు 31 స్థానాలు తగ్గాయి. బిఎస్‌పికి 4, ఆర్‌ఎల్‌టిపికి 2 స్థానాలు తగ్గగా, ఆర్‌ఎల్‌డి తన ఒక్కస్థానాన్ని పదిలం చేసుకుంది. అలాగే గత ఎన్నికలతో పోల్చితే బిజెపికి 2.92 శాతం, కాంగ్రెస్‌కు 0.23 శాతం ఓట్లు పెరిగాయి. అయితే బిజెపి, కాంగ్రెస్ మధ్య 2.16 శాతం ఓట్లు తేడా ఉంది.

హిందీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ వైఫల్యం!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హిందీ భాషా రాష్ట్రాల్లో బిజెపిని ధీటుగా ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని మరోసారి రుజువైంది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో స్వల్ప మెజారిటీతోనూ, చత్తీస్‌గఢ్‌లో పూర్తి మెజారిటీతోనూ అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. 25 లోక్‌సభ స్థానాలున్న రాజస్థాన్‌లో 2014, 2019 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. 29 స్థానాలున్న మధ్యప్రదేశ్‌లో 2014లో రెండు, 2019లో ఒకటి గెలుచుకుంది. 11 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్‌లో 2014లో ఒకటి, 2019లో రెండు స్థానాలే గెలుపొందింది. హిందీ రాష్ట్రాల్లో నాలుగు లోక్‌సభ స్థానాలున్న చిన్న రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్‌లో మాత్రమే కాంగ్రెస్ గెలుపొందింది. హిందీ రాష్ట్రాల్లో గుండెకాయ లాంటి ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో దశాబ్దాలుగా కాంగ్రెస్ ప్రభావం కోల్పోయింది. ఇక్కడ బిజెపి మతతత్వ ఫాసిజాన్ని ఎస్‌పి, ఆర్‌జెడి, జెడియు వంటి సోషలిస్టు పార్టీలు తిప్పికొడుతున్నాయి. జార్ఖండ్‌లో బిజెపికి వ్యతిరేకంగా హేమంత్ సోరన్‌కు చెందిన జెఎంఎం ఉంది. యుపిలో కాంగ్రెస్‌కు కంచుకోటలైన రాయ్‌బరేలీ, అమేథీల్లోనూ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. 2019లో అమేథీలో బిజెపి అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో రాహుల్‌గాంధీ ఓడిపోయారు. ఎస్పీ మద్దతుతో సోనియా గాంధీ రాయ్‌బరేలీలో గెలవగలిగారు.

హర్యానా వంటి ఇతర హిందీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ గత రెండు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేతిలో ఓడిపోతూనే ఉంది. ఉత్తరాఖండ్‌లో కూడా రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ పనితీరు దయనీయంగా ఉంది. ఉత్తర భారతదేశంలో భాగమైన గుజరాత్‌లో కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉంది. కాంగ్రెస్‌తో ముఖాముఖి పోరులో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపి సులువుగా విజయం సాధిస్తోంది. కాంగ్రెస్ బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో ఎస్‌పి, ఆర్‌జెడి వంటి పార్టీలు, దక్షిణాది రాష్ట్రాలు బిజెపి మతతత్వాన్ని ప్రతిఘటిస్తున్నాయి.

సైద్ధాంతిక పోరు కొనసాగుతుంది : రాహుల్ గాంధీ

"మూడు రాష్ట్రాల్లో ప్రజలిచ్చిన తీర్పును హుందాగా స్వీకరించాం." అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తెలిపారు. ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ, సైద్ధాంతిక పోరు మాత్రం కొనసాగుతుందని చెప్పారు. తెలంగాణాలో అధికారాన్ని కట్టబెట్టినందుకు ఆ రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకుంటామన్నారు.

కాంగ్రెస్‌కు ఊహించని షాక్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. ఎగ్జిట్ పోల్స్‌ను తారుమారు చేస్తూ ఫలితాలు వెలువడ్డాయి. అక్కడి ఓటర్లు మార్పును కోరుకున్నారు. బిజెపిని గెలిపించారు. ముఖ్యమంత్రి భూపేష్ భగేలా ప్రజాదరణ కలిగిన నాయకుడు అయినప్పటికీ, ప్రజల ఆకాంక్షలను అందుకోలేకపోయారు. ఆపు పేడ కొనుగోలు వంటి హిందూత్వ పథకాలను తీసుకొచ్చినప్పటికీ, ప్రజలు ఓడించారు. మొత్తం 90 స్థానాలకు గాను బిజెపి 54 (46.28 శాతం), కాంగ్రెస్ 35 (42.19 శాతం), జిజిపి 1 స్థానంలో గెలిచింది. 2018 ఎన్నికలతో పోల్చితే బిజెపికి 39 స్థానాలు పెరగగా, కాంగ్రెస్‌కు 33 స్థానాలు తగ్గాయి. కొత్తగా ఈసారి గోండ్వానా రిపబ్లిక్ పార్టీ (జిజిపి) ఒక స్థానాన్ని సొంతం చేసుకుంది. అలాగే గత ఎన్నికలతో పోల్చితే బిజెపికి 13.31 శాతం ఓట్లు పెరగగా, కాంగ్రెస్‌కు 0.85 శాతం ఓట్లు తగ్గాయి. అయితే బిజెపి, కాంగ్రెస్ మధ్య 4.09 శాతం ఓట్లు తేడా ఉంది.

మధ్యప్రదేశ్‌లో ...

మధ్య ప్రదేశ్‌లో గతసారి 114 అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ బలం ఈసారి బాగా పడిపోయింది. సంస్థాగతంగా బలహీనంగా ఉండటం కూడా ఆ పార్టీకి నష్టం చేకూర్చింది. మధ్యప్రదేశ్‌లో కూడా రాజస్థాన్‌లో మాదిరే భావసారూప్య పార్టీలతో పొత్తులకు కాంగ్రెస్ పార్టీ తిరస్కరించింది. ఉత్తరప్రదేశ్ సరిహద్దు బుందేల్ ఖండ్ ప్రాంతంలో ప్రభావముండే సమాజ్‌వాదీ పార్టీతో కాంగ్రెస్ పార్టీ పొత్తు చర్చలు జరిగినప్పటికీ, మధ్యలోనే ఆగిపోయాయి. ఇది కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చింది. మొత్తం 230 స్థానాలకు గాను బిజెపి 164 (48.56 శాతం), కాంగ్రెస్ 65 (40.42 శాతం), భారత్ ఆదివాసీ పార్టీ (బిఎపి) 1 స్థానంలో గెలిచింది. 2018 ఎన్నికలతో పోల్చితే బిజెపికి 55 స్థానాలు పెరగగా, కాంగ్రెస్‌కు 49 స్థానాలు తగ్గాయి. కొత్తగా ఈసారి భారత్ ఆదివాసీ పార్టీ (బిఎపి) ఒక స్థానాన్ని సొంతం చేసుకుంది. అలాగే గత ఎన్నికలతో పోల్చితే బిజెపికి 7.54 శాతం ఓట్లు పెరగగా, కాంగ్రెస్‌కు 0.47 శాతం ఓట్లు తగ్గాయి. అయితే బిజెపి, కాంగ్రెస్ మధ్య 8.14 శాతం ఓట్లు తేడా ఉంది.

తెలంగాణలో హస్తం హవా

బిఆర్‌ఎస్ ఘోర పరాజయం

ప్రజాశక్తి- హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. 119 శాసనసభా స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లు సాధించి, ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. మూడోసారి ముఖ్యమంత్రి నినాదంతో బరిలోకి దిగిన బీఆర్‌ఎస్ పార్టీ 39 స్థానాలకే పరిమితమైంది. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు తన ఓఎస్డీ ద్వారా రాజీనామా లేఖను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు పంపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ కోరారు. అయితే అంతకుముందే కేసీఆర్ ఫామ్ హౌజ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడకముందే కాంగ్రెస్ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపిన డీజీపీ అంజనీకుమార్‌ను నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి రవిగుప్తాను డీజీపీగా నియమించారు. అంజన్‌కుమార్‌తో పాటు రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లిన సీఐడీ చీఫ్ మహేష్ భగవత్, సంజయ్ కుమార్‌లకు ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు ఇచ్చింది.2018 శాసనసభ ఎన్నికల్లో కేవలం ఒకే స్థానంలో గెలుపొందిన బీజేపీ, ఆ తర్వాత జరిగిన హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం సాధించి మూడుస్థానాలకు చేరింది. ప్రస్తుత ఎన్నికలో బిజెపి 8 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. వీరిలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తప్ప మిగిలిన వారెవరూ గతంలో బీజేపీ నుంచి పోటీచేసిన వారు కాకపోవడం గమనార్హం. ఆ పార్టీ ముఖ్యనేతలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రఘునందనరావు వంటి వారు ఓటమి పాలయ్యారు. గజ్వేల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ గెలుపొందారు. ఆదే సమయంలో కామారెడ్డిలో మూడోస్థానానికి పరిమితమయ్యారు. 2018 ఎన్నికలతో పోలిస్తే గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ మెజారిటీ దాదాపు 13వేలకు పైగా తగ్గింది. 2018 లో లక్షకు పైగా మెజారిటి సాధించిన మంత్రి తన్నీరు హరీశ్‌రావు, 80వేలకు పైగా మెజార్టీ సాధించిన మరో మంత్రి కే తారకరామారావులకు ఈసారి దాదాపు 30వేల మెజారిటీ మాత్రమే వచ్చింది. పలువురు మంత్రులూ ఓడిపోయారు. పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్య నువ్వా...నేనా అన్నట్టు జరిగిన పోటీలో మధ్యస్థంగా బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. హుజూరాబాద్, గజ్వేల్ నుంచి పోటీచేసిన ఈటల రాజేందర్ రెండుచోట్లా ఓడిపోయారు. ఆయనపై బీజేపీ పెట్టుకున్న ఆశలు నెరవేరలేదు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు నుంచే కాంగ్రెస్ హవా కొనసాగింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. కామారెడ్డిలో మూడో స్థానంలో నిలిచారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వ్యతిరేకత ఎంఐఎంపై కూడా పడింది. ఆపార్టీ ఏడు స్థానాల్లో గెలుపొందినా, నాలుగు స్థానాల్లో కాంగ్రెస్‌తో గట్టిపోటీ ఎదుర్కోవలసి వచ్చింది. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని కొత్తగూడెం నుంచి పోటీచేసిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధించారు. ఓటమి భారంతో తెలంగాణ భవన్ బోసిపోయింది. బీఆర్‌ఎస్ నేతలు ఎవరూ ఆ ఛాయల్లో కనిపించలేదు. బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేల్లో సగం మందికి పైగా కాంగ్రెస్ గూటికి చేరతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. భద్రాచలం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆ వెంటనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటించడం గమనార్హం.

ఖమ్మం, నల్గొండ, వరంగల్, పాలమూరు జిల్లాల్లో, ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ జోరు

తెలంగాణ గ్రామీణ ప్రాంతాలన్నీ కాంగ్రెస్‌కు జై కొట్టాయి. హస్తం పట్టులేని ఉత్తర తెలంగాణలో కూడా ఈసారి కాంగ్రెస్ పుంజుకుంది. కాంగ్రెస్ పార్టీ కంచుకోటలైన ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఆపార్టీ హవా కొనసాగింది. వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ కాంగ్రెస్ సత్తా చాటింది. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో బిఆర్‌ఎస్ బలహీనపడగా.. ఆస్థానాలను బిజెపి భర్తీచేసింది.

జిహెచ్ఎంసి పరిధిలో కారు జోరు

జిహెచ్‌ఎంసి పరిధిలో మాత్రం బిఆర్‌ఎస్ పరువు దక్కించుకుంది. హైదరాబాద్‌పై ఆశలు పెట్టుకున్న బిజెపికి ఒక్క స్థానం మాత్రమే దక్కింది.

రాష్ట్ర వ్యాప్తంగా 80కి పైగా స్థానాల్లో బిజెపికి డిపాజిట్లు దక్కలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలలోని 10 నియోజకవర్గాల్లో 8 కాంగ్రెస్ గెలవగా, కాంగ్రెస్ పొత్తుతో కొత్తగూడెంలో సిపిఐ విజయం సాధించింది. భద్రాచలంలో మాత్రమే బిఆర్‌ఎస్ గెలిచింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 12 స్థానాల్లో ఒక్కటి మినహా మిగిలినవన్నీ హస్తగతమయ్యాయి. ఉమ్మడి వరంగల్ లో 10నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జైత్రయాత్ర కొనసాగింది. ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్‌లో 7, నిజామాబాద్‌లో 4, ఆదిలాబాద్ జిల్లాలో 4 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు.

బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ సొంత జిల్లాలో కూడా కాంగ్రెస్ 4 స్థానాలను కైవసం చేసుకుంది. రంగారెడ్డిలో బిఆర్‌ఎస్‌కు గట్టి పోటీనిచ్చిన కాంగ్రెస్ 7 స్థానాల్లో విజయం సాధించింది. మొత్తం 119 స్థానాలకు గాను కాంగ్రెస్ 64 (39.38 శాతం), బిఆర్‌ఎస్ 39 (37.38 శాతం), బిజెపి 8 (13.90 శాతం), ఎంఐఎం 7 (2.16 శాతం), సిపిఐ 1 (0.35 శాతం) స్థానంలో గెలిచింది. 2018 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్‌కు 45 స్థానాలు పెరగగా, బిఆర్‌ఎస్ 49 స్థానాలు తగ్గాయి. బిజెపికి ఏడు స్థానాలు పెరిగాయి. ఎంఐఎం తన స్థానాలను పదిలం చేసుకుంది. కొత్తగా ఈసారి కాంగ్రెస్ మద్దతుతో సిపిఐ ఒకస్థానాన్ని సొంతం చేసుకుంది. అలాగే గత ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్‌కు 11.34 శాతం ఓట్లు పెరగగా, బిఆర్‌ఎస్‌కు 8.71 శాతం ఓట్లు తగ్గాయి. బిజెపికి 6.92 శాతం ఓట్లు, ఎంఐఎంకి 0.09 శాతం ఓట్లు పెరిగాయి. అయితే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్య కేవలం 2 శాతం ఓట్లు తేడా మాత్రమే ఉంది. ప్రస్తుత ఎన్నికల్లో బిజెపి గణనీయంగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చింది.

తమిళనాడులో వియత్నాం బృందం పర్యటన

చెన్నై : సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాంకు చెందిన సాంస్కృతిక ప్రతినిధి బృందం సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించింది. ఆ బృందానికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి.రామకృష్ణన్, రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు యు వాసుకి, పి.షణ్ముగం తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆ బృందం సభ్యులు సిపిఎం నాయకులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. వియత్నాం పోరాట గీతాలను పాడి, పార్టీ నేతలతో ఫొటోలు తీసుకున్నారు.

11.61 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు సరైన రికార్డుల్లే వట!

(మొదటి పేజీ తరువాయి)

ఎలక్ట్రానిక్ రెవెన్యూ (వెబ్‌ల్యాండ్) రికార్డుల్లో పట్టాదారు పేరును చేర్చడానికి సదుపాయం కల్పించవచ్చని ప్రభుత్వం పేర్కొంది. కర్నూలు జిల్లాలో కొన్ని అసైన్డ్ భూములు ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్సులో ప్రభుత్వ భూమి 'కేటాయించలేదు' అని నమోదు చేసినట్లు గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆయా భూములకు నిజమైన యజమానులు ఎవరనే అంశాన్ని గుర్తించేందుకు విఆర్ఓ లాగిన్‌లోకి పంపడం జరిగిందని సమాచారం. ఇక్కడే పెద్ద ఎత్తున రాజకీయ నాయకుల ఒత్తిడులతో భూములు చేతులు మారే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ముఖ్యంగా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఒత్తిడులు అధికంగా ఉంటాయనే చర్చ నడుస్తోంది.

నాలుగు రకాలుగా చుక్కల భూములు

చుక్కల భూములను ప్రభుత్వం నాలుగు రకాలుగా వర్గీకరించింది. 22(ఎ)(1)(ఎ),(బి), (సి),(డి), అండ్ (ఇ) కింద నిషేధించబడిన జాబితాలో పొందుపరిచారు. వీటిలో షరతుల గల పట్టా భూములు, ప్రభుత్వ భూములు/లంక భూములు కొత్త అసైన్‌మెంట్, గ్రామ సేవా ఇనామ్‌లు భూములను నిషేధిత భూముల జాబితాలో తొలగించి వెబ్ ల్యాండ్ సవరణ చేయవచ్చని సూచించారు.

మేం సిద్ధం..

ఉంటుందని కాంగ్రెస్ నేతల నుండి అధికారయంత్రాంగానికి సమాచారం అందినట్లు తెలిసింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారని, ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతో పాటు వీలైతే సోనియాగాంధీ కూడా హాజరవుతారని ప్రచారం జరుగుతోంది.

ఉదయం 9.30కి సిఎల్‌పి

నేటి (సోమవారం) ఉదయం 9.30 గంటలకు కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశం జరుగుతుందని కాంగ్రెస్ నేత డి.కె శివకుమార్ చెప్పారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం రాజ్‌భవన్ వద్ద ఇతర నాయకులతో కలిసి ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. శాసన సభలో తమకు 65 మంది సభ్యులు ఉన్నారని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.' సిఎల్‌పి సమావేశంలో నాయకుడిని ఎన్నుకుంటాం. అనంతరం గవర్నర్‌కు తెలియచేస్తాం' అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిస్తూ ' కాంగ్రెస్‌లో ఒక విధానం ఉంటుంది. దాని ప్రకారమే ఆ ప్రక్రియ జరుగుతుంది.' అని అన్నారు.

పాక్‌లో బస్సుపై కాల్పులు : 9మంది మృతి

పెషావర్ : ఉత్తర పాకిస్తాన్‌లో ఒక బస్సుపై తీవ్రవాదులు కాల్పులు జరపడంతో ఇద్దరు సైనికులతో సహా తొమ్మిది మంది చనిపోయారు. శనివారం రాత్రి గిల్గిత్ బాల్టిస్తాన్ ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుందని పోలీసు అధికారి అజ్మత్ షా తెలిపారు. బస్సుపై కాల్పులు జరపడంతో డ్రైవర్‌కు వాహనంపై అదుపు తప్పి ట్రక్కును ఢీకొంది. దాంతో ట్రక్కుకు నిప్పంటుకుని ఇరు వాహనాల డ్రైవర్లు మరణించారు. ఈ సంఘటనలో 26మంది గాయపడ్డారు.

ఫిలిప్పీన్స్‌లో ప్రార్థనా సమావేశంపై బాంబు దాడి

- నలుగురు మృతి

మనీలా : దక్షిణ ఫిలిప్పీన్స్‌లో క్రైస్తవుల ప్రార్థనలపై ఆదివారం శక్తివంతమైన బాంబు దాడి జరగడంతో నలుగురు మరణించారు. దాదాపు 50మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మరావి నగరంలోని ఒక యూనివర్శిటీ జిమ్నాజియంలో ప్రార్థనా సమావేశం జరుగుతుండగా ఈ పేలుడు సంభవించింది. గాయపడిన వారిలో ఇద్దరు మృత్యువుతో పోరాడుతున్నారని, మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారని సెక్యూరిటీ చీఫ్ తాహా తెలిపారు.

ఇంధన వనరుల ఎంపికపై ఆంక్షలొద్దు

- కాప్ సదస్సులో భారత్
- ఇంధన సామర్థ్య ఒప్పందానికి భారత్, చైనా దూరం

దుబాయ్ : ఏ తరహా ఇంధన వనరులు వాడాలి, ఏవి వాడకూడదనే విషయంలో విధించే ఆంక్షలకు భారత్ కట్టుబడి వుండదని పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనా నందన్ స్పష్టం చేశారు. పునర్వినియోగ ఇంధనాన్ని విస్తరించడానికి భారత్ కట్టుబడి వుంటుందని తెలిపారు. 2030కల్లా పునర్వినియోగ ఇంధన సామర్ధ్యాన్ని మూడు రెట్లు పెంచాలని ప్రతిన చేస్తూ 118 దేశాలు సంతకాలు చేసిన ఒప్పందానికి భారత్, చైనా దూరంగా వున్నాయి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడంతోపాటు పరిశుద్ధమైన ఇంధనాన్ని పెంచాలని ఒక డిక్లరేషన్ తీసుకొచ్చింది. తమ ప్రజల జీవన ప్రమాణాలను వేగంగా మెరుగుపరచడానికిగాను తమకు అతిపెద్ద ఇంధన వనరుగా వున్న బొగ్గ నిల్వలపై ఆధారపడాల్సి వుందని భారత్ సుదీర్ఘ కాలంగా చెబుతూ వస్తోంది. బొగ్గ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని విడనాడనాలని డిమాండ్లు వస్తున్నాయి. ప్రపంచ సగటు తలసరి కాలుష్యం నాలుగు శాతం కన్నా తక్కువగానే వున్నందున కార్బన్ల సంక్షోభానికి భారత్ దోహదపడుతున్న వాటా చాలా తక్కువ అని, అందువల్ల బొగ్గను వినియోగించే హక్కు తమకు వుందని భారత్ పునరుద్ఘాటించింది. ఈ డిక్లరేషన్ల లక్ష్యాలను నిర్దిష్ట కాలుష్యాల కేటగిరీకి ముడిపెట్టడాన్ని భారత్ వ్యతిరేకించింది. "వ్యాక్సిన్లు, మందులను నిల్వ చేసుకోవడానికి మాకు కోల్డ్ స్టోరేజీలు అవసరం. పైగా ఇవన్నీ మా ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలను పటిష్టంగా వుంచడానికి ముడిపడినవే. వీటిని ఉపయోగించడం వల్ల వాతావరణ కాలుష్యానికి ఆజ్యం పోస్తున్నారని, వీటి బదులుగా ఆ ఇంధనాలను ఎంచుకోవాలంటూ చెప్పడం వంటివి భారత్‌కు ఆమోదయోగ్యం కాదని నందన్ స్పష్టం చేశారు.

డెత్ జోన్‌గా గాజా

24 గంటల్లో 700 మందికి పైగా పాలస్తీనియన్లు మృతి

గాజా : ఇజ్రాయిల్ నరమేధంతో గత 24 గంటల్లో గాజాలో 700మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని ప్రభుత్వ మీడియా కార్యాలయ డైరెక్టర్ జనరల్ తెలిపారు. 15లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారని చెప్పారు. వెస్ట్ బ్యాంక్‌లో రాత్రంగా కొనసాగిన దాడుల్లో 60మంది పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకున్నారు. ప్రధానంగా హెబ్రాన్, బెత్లెహామ్, రమల్లా, నబ్లస్, జెనిన్ నగరాల్లో శనివారం ఈ అరెస్టులు చోటుచేసుకున్నాయి. ఎలాంటి అభియోగాలు, విచారణ లేకుండానే పాలనాపరమైన నిర్బంధం పేరుతో వీరిని అరెస్టు చేశారు. గాజాపై దాడులను ముమ్మరం చేసిన నేపథ్యంలో ఇక ఇజ్రాయిల్‌తో చర్చలు పునరుద్ధరించేది లేదని, బందీలు-ఖైదీల మార్పిడి కోసం సంధి చర్చలు జరగబోవని హమాస్ తేల్చి చెప్పింది. హమాస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందంటూ ఖతార్‌లో జరుగుతున్న చర్చల నుండి ఇజ్రాయిల్ వెనక్కి మళ్ళింది.

డెత్‌జోన్‌లా మారింది : యునిసెఫ్

గాజాకు దక్షిణ ప్రాంతం ఖాన్ యూనిస్‌లోని నాజర్ ఆస్పత్రిలో దృశ్యాలు చూస్తుంటే అదంతా డెత్ జోన్‌లా మారిందని యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ వ్యాఖ్యానించారు. ఎక్కడ చూసినా థర్డ్ డిగ్రీ కాలిన గాయాలతో పిల్లలు నేలపై పడి వున్నారు. పదునైన ఆయుధాలు గుచ్చుకున్న గాయాలు, విరిగిన కాళ్లు చేతులు, తలకు దెబ్బలతో కనిపిస్తున్నారు. మృత్యుముఖంలో వున్న చిన్నారులను పట్టుకుని తల్లులు ఏడుస్తూ వుండడం చూస్తుంటే ఆ ప్రాంతమంతా మరణమృదంగం వినిపిస్తోందన్నారు. పెరుగుతున్న వ్యాధులు రెండో ముప్పుగా మారాయని జేమ్స్ పేర్కొన్నారు. తాగు నీరు, పారిశుధ్యం, రక్షణ లేక అనేకమంది పిల్లలు మరణిస్తున్నారని అన్నారు. యుద్ధం ఆరంభమైన తర్వాత ఆరు వేల మందికి పైగా పిల్లలు మరణించారని తెలిపారు. గాజాలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని పాఠశాలల్లో ఒకదాంట్లో హెపటైటిస్ ఎ తలెత్తిందని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ డైరెక్టర్ థామస్ వైట్ తెలిపారు.

పారిశుధ్యం తీవ్ర సమస్యగా మారిందని, ప్రజలు ఇరుకిరుకుగా వుంటుండటంతో వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి పాఠశాలల్లో నీటి సదుపాయం చాలా దారుణంగా వుందని, సగటున 125మందికి ఒక్కటే టాయిలెట్ వుందన్నారు. గల్ఫ్ సహకార మండలి సదస్సు మంగళవారం నుండి దోహాలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో గల్ఫ్ దేశాల విదేశాంగ మంత్రులు సమావేశమయ్యారు. గాజాలో తక్షణమే యుద్ధాన్ని విరమించాలని అరబ్, ముస్లిం నేతలు ఒక సంయుక్త ప్రకటనలో పిలుపిచ్చి న మూడు వారాల తర్వాత పై సదస్సు జరగనుంది.

మీకోసం

నెయ్యి త్వరగా పేరుకుపోకుండా ఉండాలంటే మీగడ కట్టేటప్పుడు కొద్దిగా నీళ్లు చల్లాలి.

జీవన సౌరభం

గెలవకపోవడం ఓటమి కాదు. మళ్లీ ప్రయత్నించకపోవడమే ఓటమి.

చెట్టు

కరువును బాపే తరువును నేను
కల్పతరువై నీకు వరములిస్తాను
నరికినా నేను చిగురించుతూనే
బతుకుపై ఆశను కల్పించుతాను

మొలకనై నేను మురిపించుతాను
వృక్షమై నేను రక్షించుతాను
వైవిధ్యానికి ఆలంబనై నేను
జీవులన్నింటికీ బతుకునిస్తాను

అమ్మ చేత పాల బువ్వనౌతాను
నాన్న చేత కీలుగుర్రమౌతాను
అన్నయ్య చేతిలో వేణువై నేను
పాటనై నిన్నెప్పుడు పలకరిస్తాను

పొలమును దున్నగా నాగలౌతాను
రోగాలు బాపగా మందునౌతాను
కనువిందు చేసే పువ్వులుగ మారి
కడుపాకలి తీర్చే గింజలౌతాను

చల్లనీ గాలితో పలకరిస్తాను
పక్షులను ప్రేమగా సాకుతుంటాను
కొండకోనల్లో జంతుజాలాన్ని
కంటికి రెప్పలా కాపాడతాను

కరువును బాపే తరువును నేను
కల్పతరువై నీకు వరములిస్తాను!

– రావిపల్లి వాసుదేవరావు,
విజయనగరం, 94417 13136.

గజిబిజి

పిల్లలూ, ఇక్కడ గజిబిజిగా ఉన్న ఆంగ్ల అక్షరాలను సరైన వరుసలో రాస్తే అర్థవంతమైన పదాలు వస్తాయి. ఇచ్చిన క్లూ ఆధారంగా ట్రై చేయండి.

4	1	3	2
K	B	O	O
1	2	3	4

3	1	4	2
O	F	T	O
1	2	3	4

2	4	1	3
R	G	F	O
1	2	3	4

3	4	1	2
O	W	S	N
1	2	3	4

నేను గీసిన బొమ్మ

జంపాన హరిత, 10వ తరగతి,
శ్రీ సాయి శ్రీనివాస హైస్కూల్,
పెద్ద అవుటపల్లి, కృష్ణా జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అరవైల్లో ఇరవైల్లా జీవించేస్తున్నారు...

అరవైల్లో ఇరవైల్లా బతకాలని చాలామందికి ఉంటుంది. అయితే అది సాధ్యమయ్యేది ఎందరికి? కొండలు, గుట్టలు ఎక్కాలని, ఎవరెస్టు శిఖరం అందుకోవాలని, హై జంప్ చేయాలని, బైక్‌పై ఎంచక్కా చెట్టాపట్టాలేసుకుని ప్రపంచమంతా చుట్టేయాలని మీ అమ్మానాన్న ఎప్పుడైనా మీతో చెప్పారా? పోనీ మీ చుట్టుపక్కలో, బంధువుల్లోనో ఎవరైనా అలా జీవిస్తున్నారేమో గమనించారా? ఉరుకులు, పరుగుల జీవితంతో విసిగి వేసారిపోయిన ఎంతోమంది వృద్ధులు, రిటైర్‌మెంట్ తరువాత జీవితం గురించి కొన్ని ప్రణాళికలు వేసుకుంటారు. ఇల్లు కట్టుకుంటారు. పెళ్ళిళ్లకి ఖర్చు పెడతారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు. అంతే.. అంతకు మించి పెద్దగా ఆశలు పెట్టుకోరు. మనవళ్లు, మనవరాళ్లతో సరదాగా గడిపేస్తే చాలనుకుంటారు చాలామంది. కానీ 'ఎప్పుడూ పిల్లలు, బాధ్యతలేనా.. మీ కోసం కూడా జీవించండి.. మీ కలలు, కోరికలు మాలా నెరవేర్చుకోండి' అంటూ ఈ వృద్ధులు నిరూపిస్తున్నారు. రిటైర్‌మెంట్ తరువాత జీవితాన్ని కొత్తగా ప్రారంభించిన వీరి సాహసాలు, సాహసయాత్రలు గురించి తెలుసుకుందాం.

మాలా హోన్నత్తి (70)

బ్యాంకు ఉద్యోగిగా ఉద్యోగ విరమణ పొందిన మాలా అడ్వెంచర్ లైఫ్ ఆమె 30 ఏళ్ల నుండే ప్రారంభమైంది. 1984 నుండి హిమాలయాలపై ట్రెక్కింగ్ చేసిన అనుభవం ఉన్న ఆమె, 1986 నాటికి ఇండియాలో ఓ పన్నెండు పర్వత శిఖరాలను అధిరోహించేశారు. కంగ్రి, లడఖ్, సితిధార్, కిలిమంజారో వంటి ఎన్నో పర్వతాలను అవలీలగా ఎక్కేశారు. ఒంటరిమహిళైన మాలా, ఒక పక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోపక్క తన కలలను నెరవేర్చుకుంటున్నారు. 2016 నాటికి సొంతంగా 'మాహో అడ్వెంచర్స్' పేరుతో ట్రెక్కింగ్ ట్రిప్‌లను ప్రారంభించారు. 'ఇది నా జీవితం.. నేనేం చేయాలో అది చేస్తాను' అంటున్న మాలా ట్రెక్కింగ్ ప్రయాణం 70 ఏళ్లు వచ్చినా కొనసాగుతూనే ఉంది.

యోగేశ్వర్ (73), సుష్మా భల్లా (69)

ఈ జంట మొదటి ప్రయాణం పెళ్లయిన కొత్తల్లో చేసిన లాంగ్ ట్రిప్‌తో ప్రారంభమైంది. హనీమూన్ కోసం బైక్‌పై శ్రీనగర్ వెళ్లింది ఈ జంట. ఆ మొదటి ప్రయాణం మరపురాని ఎన్నో తీపి గుర్తులను అందించింది. అందుకే 47 ఏళ్ల తరువాత మళ్లీ అలాంటి లాంగ్ ట్రిప్‌లు వేయాలని నిర్ణయించుకున్నారు. ఎంచక్కా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ వేసుకుని చేయి చేయి పట్టుకుని గాల్లో తేలిపోతూ, ఊహల్లో గంతులేస్తూ సుదూర ప్రాంతాలకు వాలిపోతున్నారు. ఈ ప్రయాణాల కోసం యేగేశ్వర్ ముందుగానే రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఇప్పటివరకు భూటాన్, నేపాల్, లేహ్, లడఖ్ వంటి 22 దేశాలను చుట్టేశారు. బైక్‌పై బెల్జియం, దుబాయ్, ఫ్రాన్స్, ఖతార్, రోమ్, సింగపూర్, ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, టర్కీ, వెనీస్ వంటి దేశాలు చూసొచ్చారంటే ఎవరూ నమ్మరు. పెద్దాయనకు 2021లో మోకీలు ఆపరేషన్ జరిగింది. 'మీ ప్రయాణాలకు ఇక కళ్లెం వేయాల్సిందేన'ని డాక్టర్లు కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. అయినా ఈ జంట ప్రయాణాలు ఆపలేదు. త్వరగా కోలుకునేందుకు తాతగారు ఫిట్‌నెస్ వర్కౌట్స్ చేసేశారు మరి. ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో ఇష్ట సఖిని వెంటేసుకుని అడ్వెంచర్ ప్రయాణాలు చేస్తున్నారు. వాటన్నింటినీ సోషల్‌మీడియా ఖాతాలో షేర్ చేస్తూ ఎంతోమంది అభిమానులని సంపాదించుకున్నారు.

మొల్లి జాయ్ (62)

మొల్లి కేరళలో ఒక కూరగాయల దుకాణం నడుపుకుని జీవిస్తున్నారు. ఎర్నాకుళం వాసి అయిన మొల్లికి, చిన్నతనం నుండే ప్రపంచాన్ని చుట్టేయ్యాలని ఆశ. కానీ ఆమె కుటుంబ పరిస్థితులు కనీసం స్కూల్లో తీసుకెళ్లే, పర్యాటక ప్రాంతాలకు కూడా సహకరించేవి కావు. పెళ్లయ్యాక భర్తతో కలిసి దక్షిణ భారతదేశం చుట్టివచ్చింది. అయినా ఆమె ఆశ తీరలేదు. దుకాణంలో ఉన్న పేపరు కట్టల్లో చూసిన ప్రపంచప్రదేశాల విశేషాలు చదివి, వాటిని చూడాలని కలలు కనేది. ఇలా ఉండగానే 2004లో ఆమె భర్త చనిపోయారు. పిల్లల బాధ్యత తనే తీసుకుంది. వారి చదువులు, పెళ్లిళ్ల ధ్యాసలో పడి, తన ఆశలకు కళ్లెం వేసింది. ఇప్పుడు పిల్లలంతా స్థిరపడ్డారు. ఎంతో కష్టపడి రూ.10 లక్షలు భద్రం చేసుకుంది. ఇప్పుడా డబ్బులతో తన ఫ్రెండ్స్‌తో కలిసి ప్రపంచాన్ని చుట్టేస్తోంది. యూరప్ దేశాలు, ఇటలీ, ఫ్రాన్స్, వాటికన్, స్విట్జర్లాండ్, జర్మనీ పర్యటించింది. దశాబ్దకాలంలో 11 దేశాలు చుట్టివచ్చింది. 'నాకు పెద్దగా ఆదాయం లేదు.. నేను సంపాదించిన దాన్ని కూడబెట్టుకుని, నాకు అత్యంత ఇష్టమైన దాని కోసం ఖర్చుపెడుతున్నాను' అంటూ చెబుతున్న మొల్లి ట్రిప్‌కి వెళ్లి వచ్చిన తరువాత తన కూరగాయల షాపులో రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ, తర్వాత ట్రిప్ కోసం డబ్బులు భద్రపర్చుకుంటోంది.

అమరజీత్ సింగ్ చావ్లా (64)

అమర్‌జీత్ యువకుడిగా ఉన్నప్పుడు అంటే 1979లో అతనికి పర్యటనల మీద ఆసక్తి ఏర్పడింది. అప్పుడు ఏర్పడిన ఆసక్తి, ఇప్పుడు 40 ఏళ్ల తరువాత నెరవేర్చుకుంటున్నాడు. ఇప్పుడతనికి తల్లిదండ్రుల అనుమతి అవసరం లేదు. అలాగే బాధ్యతల నుండి విముక్తి లభించింది. ఈ అవకాశాన్ని వృథా చేసుకోవడం అసలు ఇష్టం లేని అమరజీత్, 2018లో టయోటా ఫార్చ్యున్ ఎస్‌యువి కారు కొని పర్యటనలు చేస్తున్నాడు. రోడ్డు మార్గం గుండా స్వల్ప కాలంలోనే 40 వేల కిలోమీటర్లు, 33 దేశాలు చుట్టివచ్చాడు. ఇప్పుడు ఆ సంఖ్య 87 దేశాలకు చేరింది. తన ప్రయాణాలన్నీ 'ద టర్బన్ ట్రావెలర్' పేరుతో సోషల్‌మీడియా ద్వారా ప్రసారం చేస్తూ ఆదాయం కూడా పొందుతున్నాడు. '60' తరువాత నా జీవితం మొదలైంది అంటూ తెగ హుషారు పడిపోతున్న అమరజీత్ సింగ్ ఇప్పుడు అంతర్జాతీయ ప్రయాణికుడు, ప్రముఖ యూట్యూబర్.

రవికిషోర్ మల్లాప్రగడ (62), సౌదామిని (58)



ఆరేళ్ల చిరుప్రాయంలో ఎత్తైన కొండ ఎక్కిన రవి, వయసు పెరుగుతున్న కొద్దీ, ఆ అనుభవాన్ని ఎంతో ఆస్వాదించేవాడు. లెక్కల మాస్టారుగా జీవితం ప్రారంభించిన రవి ఆ తరువాత దుబాయ్ వెళ్లిపోయారు. అక్కడికి వెళ్లినా ట్రెక్కింగ్‌పై ఆయనకున్న ప్రేమ మాత్రం తగ్గలేదు. ఈసారి అతని కలకు భార్య కూడా తోడైంది. వారాంతాల్లో ఇద్దరూ లాంగ్‌ట్రిప్‌లు వేసేస్తుంటారు. అడ్వెంచర్ ఆటలెన్నో ఆడేస్తారు. 2022లో ఈ జంట కిలిమంజారో గిల్‌మ్యాన్స్ పాయింట్‌కి ట్రెక్కింగ్ చేశారు. అంతేకాదు, జోర్డాన్, నేపాల్, శ్రీలంక, జపాన్, యుఎఇ, ఈజిప్ట్, సింగపూర్, థాయ్‌ల్యాండ్, కాంబోడియా దేశాల్లో నిర్వహించిన స్కై డైవింగ్, బంగీజంప్, స్కూబా డైవింగ్, పారాగ్లిడ్డింగ్, హాట్ ఎయిర్ బెలూన్ రైడ్, సబ్‌మెరైన్ రైడ్‌ల్లో పాల్గొన్నారు. వచ్చే ఏడాది నేపాల్‌లో జరిగే జిప్ లైనింగ్, బంగీ జంపింగ్ వీరి జాబితాలో ఉన్నాయి.

యుటిఎఫ్ నేత ఎకె దత్‌కు నివాళులర్పిస్తున్న వివిఎస్‌ఆర్, తదితరులు

దత్ భౌతికకాయం మెడికల్ కాలేజీకి అప్పగింత

- వి శ్రీనివాసరావు, తదితరుల నివాళి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

అనారోగ్యం కారణంగా మృతి చెందిన యుటిఎఫ్ సీనియర్ నాయకులు అక్షయ కుమార్ దత్, (77) భౌతికకాయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఎం కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎపి యుటిఎఫ్ నేతలు నివాళులర్పించారు. అభిమానుల సందర్శనార్థం దత్ భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం అశోక్‌నగర్‌లోని యుటిఎఫ్ కార్యాలయానికి తరలించారు. అక్కడ వివిఎస్‌ఆర్‌తోపాటు ఉమ్మడి రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు జోజయ్య, ఎపి యుటిఎఫ్ ప్రచార కమిటీ చైర్మన్ తాండవ కృష్ణ, పత్రిక ప్రధాన సంపాదకులు కుమార రాజా, ఎన్‌టిఆర్ జిల్లా యుటిఎఫ్ నాయకులు సుందరయ్య, రంగారావు, కోటేశ్వరరావు తదితరులు దత్‌కు నివాళు లర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని అల్వాల్‌లోని దత్ స్వగృహానికి కుటుంబ సభ్యులు తరలించారు. దత్ పార్థివదేహాన్ని చిలుకూరులోని భాస్కర మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారాన్ని అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్

చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి– విజయనగరం కోట

ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ గురజాడ విశిష్ట పురస్కారం అందుకున్నారు. విజయనగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. కళా, సాంస్కృతిక రంగాల్లో కృషి చేసిన వారికి ఏటా గురజాడ విశిష్ట పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఈ ఏడాది చంద్రబోస్‌ను ఎంపిక చేశారు. తొలుత గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్... చంద్రబోస్‌కు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ గురజాడ అవార్డు దక్కడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఈ ఏడాది తన జీవితంలో మరచిపోలేనిదని తెలిపారు. భవిష్యత్తులో సంఘ పరివర్తనకు ఉపయోగ పడే పాటలు రాస్తానని వెల్లడించారు. హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చంద్రబోస్ మహాకవుల వారసుడని, ఆయనకు తెలుగు భాష అంటే వల్లమాలిన అభిమానమని తెలిపారు. మన భాషలో మనం మాట్లాడుకుంటే బంధాలు, బంధుత్వాలు బలపడతాయన్నారు. అనంతరం గురజాడ వారసులను చంద్రబోస్ ఆధ్వర్యాన సత్కరించారు. ఈ సందర్భంగా మహిళలతో కన్యాశుల్కం నాటికను ప్రదర్శించారు. సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సూర్యప్రకాశ్, న్యాయవాది కోలగట్ల తమ్మన్నశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

4-1తో సిరీస్ వశం

చివరి టీ20లో భారత్ గెలుపు- ఛేదనలో ఆసీస్ చతికిల

భారత్ 160/8, ఆసీస్ 154/8

ప్రపంచకప్ ఫైనల్ ఓటమి బాధ నుంచి తేరుకున్న టీమ్ ఇండియా.. ఆస్ట్రేలియాను చిత్తు చేసి టీ20 సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో స్లో పిచ్‌పై జరిగిన స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో ఆతిథ్య భారత్ 6 పరుగుల తేడాతో గెలుపొందింది. 161 పరుగుల ఛేదనలో కంగారూలు 154 పరుగులే చేశారు. శ్రేయస్ అయ్యర్ (53), అక్షర్ పటేల్ (31), జితేశ్ శర్మ (24), యశస్వి జైస్వాల్ (21) రాణించటంతో భారత్ తొలుత 160 పరుగులు చేసింది. ఛేదనలో మెక్ డార్మెట్ (54) మెరిసినా.. ఆసీస్‌కు పరాజయం తప్పలేదు.

బెంగళూర్ : టీ20 సిరీస్ టీమ్ ఇండియా సొంతమైంది. చివరి మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియాను చిత్తు చేసిన ఆతిథ్య భారత్ 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో ఉత్కంఠ విజయం సాధించిన భారత్ 4–1తో టీ20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ (53, 37 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీకి తోడు అక్షర్ పటేల్ (31, 21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ శర్మ (24, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), యశస్వి జైస్వాల్ (21, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించటంతో తొలుత భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 160 పరుగులు చేసింది. ఛేదనలో ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులే చేసింది. మెక్‌డార్మెట్ (54, 36 బంతుల్లో 5 సిక్స్‌లు), ట్రావిశ్ హెడ్ (28, 18 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) ఆసీస్‌ను రేసులో నిలుపగా.. ఆఖర్లో కెప్టెన్ మాథ్యూ వేడ్ (22, 15 బంతుల్లో 4 ఫోర్లు) తన వంతు ప్రయత్నం చేశాడు. చివరి ఆరు బంతుల్లో 9 పరుగులు అవసరమైన దశలో మాథ్యూ వేడ్‌ను అవుట్ చేసిన అర్షదీప్ సింగ్.. ఆతిథ్య భారత్‌ను విజేతగా నిలిపాడు. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్ (3/32), రవి బిష్ణోయ్ (2/29), అర్షదీప్ సింగ్ (2/40) రాణించారు.

జెన్నీఫర్, దివ్యాన్ని చరిత్ర

న్యూఢిల్లీ : టేబుల్ టెన్నిస్‌లో భారత యువ జోడీ చరిత్ర సృష్టించింది. ప్రపంచ యూత్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో రజత పతకం సాధించి న జెన్నీఫర్ వర్గీస్, దివ్యాన్ని బోమిక్‌లు ఈ ఘనత సాధించిన తొలి భారత ప్యాడ్లర్ జోడీగా నిలిచింది. స్లోవేకియాలో జరిగిన ఈవెంట్‌లో అండర్–15 బాలికల విభాగంలో జెన్నీఫర్, దివ్యాన్ని సిల్వర్ షో చేశారు. ఫైనల్లో 5–11, 11–8, 4–11, 2–11తో పరాజయం పాలైంది. అండర్–15 మిక్స్‌డ్ డబుల్స్‌లో జెన్నిఫర్ కాంస్య పతకం సైతం కొల్లగొట్టింది. ఈ టోర్నీలో భారత్‌కు కాంస్య పతకమే ఇప్పటి వరకు అత్యుత్తమం. 'ఎంతో గర్వంగా ఉంది. సిల్వర్ మెడల్ ఊహించలేదు. సెమీస్‌లో బలమైన ఫ్రెంచ్, చైనీస్ జోడీపై విజయం అద్భుతం' అని జెన్నీఫర్, దివ్యాన్ని తెలిపారు.

హైదరాబాద్ మూడో విజయం

జైపూర్ : విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మూడో విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఆరో రౌండ్ మ్యాచ్‌లో విదర్భపై 30 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ 50 ఓవర్లలో 8 వికెట్లకు 286 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (102, 98 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకంతో మెరువగా.. ఓపెనర్లు ధ్రువ్ (83, 99 బంతుల్లో 7 ఫోర్లు), అతర్వ (44) రాణించారు. ఛేదనలో తన్మయ్ అగర్వాల్ (77 నాటౌట్, 77 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ రాహుల్ సింగ్ (62 నాటౌట్, 80 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీలతో రాణించగా 29 ఓవర్లలో హైదరాబాద్ 159/1 పరుగులు చేసింది. ఈ సమయంలో వెలుతురు లేమి, స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల సమస్యతో మ్యాచ్ గంటన్నరకు పైగా నిలిచిపోయింది. దీంతో ఫలితాన్ని వినోద్ జైదేవ్ (విజెడి) పద్ధతిలో తేల్చారు. హైదరాబాద్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. గ్రూప్–బి టాపర్ విదర్భకు ఇదే తొలి ఓటమి.

దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

కేంద్రం దిగొచ్చే వరకూ 'ఉక్కు' పోరాటం

ప్రజాశక్తి – ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశంపై కేంద్రంలోని మోడీ సర్కారు దిగొచ్చే వరకూ పోరాటం కొనసాగుతుందని హెచ్‌ఎంఎస్ యూనియన్ స్టీల్‌ప్లాంట్ విభాగం ప్రధాన కార్యదర్శి జి గణపతి రెడ్డి స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1025వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటీకరణ కానిచ్చేది లేదన్నారు. అవసరమైతే తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తామన్నారు. ఉక్కు నిర్వాసితులకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించకపోవడం దుర్మార్గమని తెలిపారు. ఆంధ్ర ప్రజల పోరాటాలను గుర్తించి ఇప్పటికైనా ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో డి నాగరాజు, యు అప్పారావు, జి రమణారెడ్డి, అప్పలరాజు, సత్యారావు, ప్రకాష్, లక్ష్మీనారాయణ, పృధ్వీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని విస్మరిస్తున్న సంపన్న దేశాలు

- జెవివి నేత మురళీధర్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

పర్యావరణ పరిరక్షణ విషయంలో అమెరికా, బ్రిటన్ లాంటి పెట్టుబడిదారీ దేశాలు బాధ్యతను విస్మరిస్తున్నాయని జనవిజ్ఞాన వేదిక (జెవివి) కార్యదర్శివర్గ సభ్యులు జి మురళీధర్ విమర్శించారు. భూమి సురక్షితంగా ఉండాలంటే అభివృద్ధి చెందిన దేశాలు వాతావరణ కాలుష్య నివారణకు కట్టుబడి ఉండాలని చెప్పారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరుగుతున్న జెవివి సోషల్ మీడియా వర్క్‌షాపు ముగింపు సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవజాతి సురక్షితంగా ఉండేందుకు కర్బన ఉద్గారాలను తగ్గించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వేలాది సంవత్సరాల్లో జరగాల్సిన పర్యావరణ విధ్వంసం కేవలం గత వందేళ్లలో సంభవించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నివారణ చర్యలకు చిత్తశుద్ధితో ఉపక్రమించాల్సిన సంపన్న దేశాలు మాటలతో కాలక్షేపం చేస్తూ ఒప్పందాలకు తిలోదకాలిస్తున్నాయని విమర్శించారు. కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) సదస్సులో కేవలం తీర్మానాలకే పరిమితం కాకుండా కార్యాచరణ ఆరంభించాలని, అప్పుడే భూమితోపాటు మనల్ని కాపాడుకోగలమన్నారు. సోషల్ మీడియా కన్వీనర్ సిహెచ్ జయప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెవివి కార్యదర్శివర్గ సభ్యులు కె శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజశేఖర్, పి శ్రీరాములు, కారుసాల శ్రీనివాస్ (ఎస్ఎంఎస్), ఆశ (స్వేచ్ఛ) పాల్గొన్నారు.

గుజరాత్ జెయింట్స్ జయకేతనం

ప్రజాశక్తి – పిఎం.పాలెం (విశాఖపట్నం)

విశాఖలోని ఎసిఎ – విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన లెజెండ్స్ క్రికెట్ లీగ్ టి – 20 మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ విజయం సాధించింది. రెండో రోజు జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ – సౌతర్న్ సూపర్ స్టార్స్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌతర్న్ సూపర్ స్టార్స్ ఓపెనర్ తరంగ 34, వికెట్ కీపర్ గోస్వామి 24 పరుగులు చేసి రాణించారు. మిగతా వారంతా తక్కువ పరుగులే చేయడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. గుజరాత్ జెయింట్స్ జట్టులో జాన్సోటన్ నాలుగో ఓవర్లలో మూడు వికెట్లు కైవసం చేసుకున్నారు. పనేసర్ 2, ఈశ్వర్ చౌదరి, లడ్డ, ప్రసన్నలకు తలో వికెట్ దక్కాయి. అనంతరం బ్యాటింగ్ చేసిన గుజరాత్ జెయింట్స్ జట్టులో కెప్టెన్ కెవిన్ ఒబ్రెయిన్ 29 పరుగులు చేసి అవుటయ్యారు. మూడో స్థానంలో దిగిన బ్యాట్స్‌మెన్ ఎ.ఝున్‌ఝున్ వాలా ఫోర్లు, సిక్స్‌లతో అద్భుతమైన ఆట తీరు కనబరిచారు. 49 బంతుల్లో పది ఫోర్లు, మూడు సిక్స్‌లతో 81 పరుగులు చేసి సెంచరీకి దగ్గరలో అవుటయ్యారు. ఆ జట్టు 18.4 ఓవర్లలో ఐదు వికెట్లకు 160 పరుగులు చేసి విజయం కైవశం చేసుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68